www.vishalabharati.com
epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
26.02.202
సంపుటి:2 సంచిక:133

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



# వేదిక పంచుకున్న రాహుల్, అఖిలేశ్ !

- రాహుల్ కు మద్దతుగా ఎస్పీ అధినేత బల ప్రదర్శన
- రాజ్యాంగాన్ని రక్షించడం.. బీజేపీని తొలగించడం..
- ప్రజాస్వామ్యాన్ని కాపాడడం ..ఇవే మా ప్రభుత్వం లక్ష్యాలు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

రాజ్యాంగాన్ని రక్షించడం.. బీజేపీని తొలగించడం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడడ ఇవే తమ లక్ష్యాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాకు చేరుకుంది. ఉత్తరప్రదేశ్‌లో యాత్ర చివరి రోజున ఇద్దరు ముఖ్య రాజకీయ నేతలు రాహుల్ గాంధీ, అఖిలే శ్‌యాదవ్ హాజరయ్యారు. ఏడేండ్ల తర్వాత రాహుల్ గాంధీ, అఖిలేశ్‌యాదవ్‌లు ఒకే వేదికపై కనిపించారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రకు సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేశ్‌యాదవ్ మద్దతు పలికారు. ఆగ్రాలో పర్యటిస్తున్న రాహుల్ గాంధీకి మద్దతుగా అఖిలేశ్ బలప్రదర్శన కనిపించింది. పెద్ద సంఖ్యలో ఎస్పీ కార్యకర్తలు కూడా హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఇరువురు నేతలు పాదయాత్ర చేపట్టారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రక్షించడం, బీజేపీని తొలగించడం, దేశాన్ని రక్షించడం మా పోరాటమన్నారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి చెందిన 80 మంది ఎంపీలను ఓడించినప్పుడే మన పోరాటం విజయవంతమవుతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని

..మిగతా 2 లో



## చేవెళ్ల సభలో మరో రెండు గ్యారంటీలు అమలు ప్రకటిస్తాం

- మార్చి నెలలో కరెంటు బిల్లులు కట్టాల్సిన అవసరం లేదు
- డ్వాక్రా సంఘాలకు త్వరలో వడ్డీలేని రుణాలు అందిస్తాం
- నేడు 43వేల మంది సింగరేణి కార్మికులకు బీమా ప్రకటన
- కొత్తగూడెంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ఈ నెల 27న చేవెళ్ల సభలో మరో రెండు గ్యారెంటీ పథకాల అమలు ప్రకటన చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..మిగతా 2 లో




# మోడీ మరో డేరింగ్ స్టంట్..

- ఏడు పదుల వయస్సులో ప్రధాని స్కూబా డైవింగ్
- అరేబియా సముద్రం లోపల పూజలు
- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్
- 'ఎక్స్' వేదికగా నరేంద్ర మోడీ పోస్ట్

ఈ ఏడాది లక్షదీప్ పర్యటనలో సాహసంతో కూడిన స్విమ్మింగ్, స్నార్కెలింగ్ చేసిన ప్రధాని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం గుజరాత్ తీరంలోని అరేబియా సముద్రంలో మరో డేరింగ్ స్టంట్ చేశారు. లోతైన సముద్రంలోకి దూకి ద్వారకా నగరం మునిగిపోయిందని విశ్వసించే ప్రదేశంలో ప్రార్థనలు చేశారు. డైవింగ్‌కు సంబంధించిన చిత్రాలను 'ఎక్స్' వేదికగా సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన ప్రధాని తన దేశ ప్రజలతో ఆయన అనుభూతిని పంచుకున్నారు.

**విశాల భారతి, నేషనల్ బ్యూరో:**

ప్రధాని మోడీ ఓ సాహస కృత్యం చేశారు. అరేబియా సముద్రంలోపలకి వెళ్లి అక్కడ పూజలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొన్ని నెలల వ్యవధిలోనే అరేబియా సముద్రంలో ప్రధాని మోదీ మరోసారి డైవింగ్ స్కూబా చేశారు. ఆయన హిందువుల పురాతన ఆధ్యాత్మిక నగరమైన ద్వారకా వద్ద ప్రార్థనలు నిర్వహించారు. ఇందుకోసం స్కూబా డైవింగ్ ద్వారా సముద్రజలాల్లోకి వెళ్లారు. ఒకప్పుడు శ్రీకృష్ణుడు ఈ నగరాన్ని పరిపాలించినట్లు హిందువులు బలంగా విశ్వసిస్తారు. ద్వారకా ద్వీపం వద్ద మోడీ స్కూబా డ్రైవింగ్

..మిగతా 2 లో



### ద్వారకలో అతిపెద్ద కేబుల్ బ్రిడ్జి ప్రారంభించిన ప్రధాని

దేశంలోనే అతిపెద్ద కేబుల్ వంతెనగా పేరు పడ్డ సుదర్శన్ సేతును ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం ప్రారంభించారు. గుజరాత్‌లోని ద్వారకలో ఉన్న ఈ వంతెన ఉంది. 2017లో ప్రధాని మోడీ ఈ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బెయిట్ ద్వీపాదన్ని ఓఖ్రా పోర్టుతో కలుపుతూ ఈ వంతెనను రూ.979 కోట్లతో నిర్మించారు. నాలుగు లేన్లు ఉన్న ఈ బ్రిడ్జి పొడవు 2.3 కిలోమీటర్లు, వెడల్పు 27.20 మీటర్లు.

# 17కు 17 పార్లమెంట్ సీట్లు గెలుస్తాం

- ఏప్రిల్ మొదటి వారంలో లోక్‌సభ ఎన్నికలు
- రాష్ట్రంలో బీఆర్ఎస్ మనుగడ ఇక ఒడిసిన ముచ్చట
- దేశంలో కాంగ్రెస్‌కు ఉన్న 40 సీట్లు కూడా రావు
- హైదరాబాద్‌లో అసదుద్దీన్‌ను ఓడించి తీరుతాం
- తెలంగాణ ప్రధాని మోడీ నాయకత్వం కోరుకుంటోంది..
- కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ జి. కిషన్‌రెడ్డి

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

ఈ సారి తెలంగాణలో 17కు 17 ఎంపీ స్థానాలు బీజేపీ గెలుచుకుంటుందని బీజేపీ స్టేట్‌చీఫ్, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మెదక్ జిల్లా తూప్రాన్‌లో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప యాత్రలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ మొదటి వారంలో దేశ వ్యాప్తంగా ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం విజయ సంకల్ప యాత్రలతో రాష్ట్రమంతా ప్రయాణిస్తున్నామని పేర్కొన్నారు. దేశానికి మోడీ ఎంతో సేవ చేశారని, టాయిలెట్ నుంచి చంద్రయాన్ వరకు నరేంద్ర మోడీ చేయని అభివృద్ధి కార్యక్రమం లేదని కిషన్ రెడ్డి తెలిపారు. పేదలకు ఉచితంగా ఇళ్లు, గ్యాస్, బియ్యం అందించారని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పేదలకు రూ.5లక్షల ఆరోగ్య భీమా అందించారు.. జాతీయ రహదారుల నిర్మాణం, గ్రామ పంచాయితీలలో అభివృద్ధికి కేంద్రం నిధులు ఇస్తుందని అన్నారు. ఏడాదికి రైతులకు మోడీ రూ. 6 వేల ఇస్తున్నారని కిషన్ రెడ్డి చెప్పారు.

హైదరాబాద్ తో సహా దేశంలో అనేక చోట్ల ఉగ్రవాద దాడులు జరిగేవి.. దేశాన్ని మోడీ శాంతియుత దేశంగా మార్చారని తెలిపారు. పాక్ ఉగ్రవాదుల ఆటకట్టించారు.. పదేళ్లుగా



దేశం శాంతియుతంగా ఉంది.. దేశంలో అందరూ సంతోషంగా ఉంటున్నారు.. దానికి కారణం మోడీనేనని కిషన్ రెడ్డి తెలిపారు. దేశం మొత్తం మోడీ ప్రధాని కావాలని కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలు మోడీ నాయకత్వం కోరుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ కథ ముగిసింది.. ఆ పార్టీ తెలంగాణకు అవసరం లేదని

..మిగతా 2 లో



# సారీ.. నేను రాలేను

- నోటీసులు రద్దు చేయండి.. లేదంటే విత్ డ్రా చేసుకోండి
- కావాలంటే వర్చువల్ పద్ధతిలో ఎంక్వైరీ చేయండి
- గత నోటీసు.. ఇప్పటి నోటీసు పూర్తి విరుద్ధంగా ఉంది
- సీబీఐకి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో :**

ఫిబ్రవరి 26న (సోమవారం) విచారణకు తాను హాజరు కాలేనంటూ సీబీఐకి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ రాశారు. సీబీఐకి రాసిన లేఖలో ఎమ్మెల్సీ కవిత కీలక అంశాలను ప్రస్తావించారు. సీఆర్పీసీ సెక్షన్ 41ఏ కింద జారీ చేసిన నోటీసులను రద్దు చేయాలని లేదా ఉపసంహరించుకోవాలని సీబీఐని ఆమె కోరారు. ఒకవేళ తన నుంచి సీబీఐకి ఏవైనా ప్రశ్నలకు సమాధానం, సమాచారం కావాలనుకుంటే వర్చువల్ పద్ధతిలో విచారణకు హాజరవ్వడానికి అందుబాటులో ఉంటానని కవిత స్పష్టం చేశారు. సీబీఐ నోటీసులకు ముందే నిర్ణయించిన కార్యక్రమాలు ఉన్న కారణంగా.. ఈ నెల 26న విచారణకు హాజరుకావడం సాధ్యం కాదని సీబీఐకి రాసిన లేఖలో పేర్కొన్నారు.

తనకు సీఆర్పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇవ్వడం సబబు కాదన్నారు. సెక్షన్ 41ఏ కింద ఎందుకు,

..మిగతా 2 లో

## తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కె.శ్రీనివాస్ రెడ్డి

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా సీనియర్ జర్నలిస్ట్ కె.శ్రీనివాస్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం శ్రీనివాస్ రెడ్డి' ప్రజా పక్షం' దినపత్రిక ఎడిటర్ గా పనిచేస్తున్నారు. తెలంగాణలో కొత్త సర్కార్ ఏర్పడిన తర్వాత నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న వారిని తొలగించింది. ఇలా ఖాళీ అయిన నామినేటెడ్ పోస్టులను కొత్త వారితో భర్తీ చేస్తుంది. తాజాగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్ రెడ్డి నియమించింది. శ్రీనివాస్ రెడ్డి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో 1996లో చంద్రబాబు హయాంలోనూ ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా కూడా పనిచేశారు. శ్రీనివాస్ రెడ్డికి తెలంగాణ ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ఇప్పటి వరకు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ గా అల్లం నారాయణ ఉన్నారు. శ్రీనివాస్ రెడ్డి గతంలో విశాలాంధ్ర పత్రిక ఎడిటర్‌గా



సుదీర్ఘ కాలం పని చేశారు. గతంలో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) సెక్రటరీ జనరల్ గా సేవలు అందించారు. ప్రస్తుతం ఐజేయూ ప్రెసిడెంట్ గా ఉన్నారు.



## కొనసాగుతున్న బీఆర్ఎస్ లీడర్ల రాజీనామాలు

- సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి రాజీనామా
- ఆయన కోడలు, రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి కూడా..
- రేపు ప్రియాంకా గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరే అవకాశం

..మిగతా 2 లో

# బ్యాంక్ ఖాతాల్లోకే రూ. 500 గ్యాస్ సబ్సిడీ!

- రూ. 80 కోట్లు విడుదలకు ప్రభుత్వం అనుమతి
- రేపు.. 40 లక్షల లబ్ధిదారులతో పథకం ప్రారంభం
- రాయితీకి రేషన్ కార్డు లింక్‌పెట్టడంతో పేదల ఆందోళన
- గత పదేండ్లలో రేషన్‌కార్డులు ఇవ్వక ఇబ్బందులు
- ఆందోళనలో కొత్తగా పెళ్లై వేరుపడిన కుటుంబాలు
- సందిగ్ధంలో 'ఉజ్వల్ కల్యాణ్ యోజన' లబ్ధిదారులు
- పేదలందరికీ రాయితీ ఇవ్వాలని డిమాండ్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

'మహాలక్ష్మి' పథకం అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది.. వినియోగదారులకు పాత విధానమైన 'నగదు బదిలీ' ద్వారానే సబ్సిడీ అందజేయాలని నిర్ణయించింది. ఈ విధానం ప్రకారం లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్ తీసుకునేటప్పుడు ఏజెన్సీలకు మొత్తం ధర చెల్లించాలి. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.955గా ఉంది. మహాలక్ష్మి పథకంలో అర్హులకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రూ.955 గ్యాస్ ధరలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 500ను సబ్సిడీ రూపంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో బదిలీ చేయాలని నిర్ణయించింది.

అలాగే కొత్తగా తీసుకునే గ్యాస్ కనెక్షన్లకు రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం వర్తించదని పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. పాత కనెక్షన్లలో రేషన్ కార్డులున్నవారికీ.. అది కూడా వాడకంలో ఉన్న సిలిండర్లకే రాష్ట్ర ప్రభుత్వ గ్యాస్ సబ్సిడీ

..మిగతా 2 లో



తెలంగాణలో మరో రెండు గ్యారంటీల అమలుకు సిద్ధమైన సర్కార్.. అందుకు అవసరమైన కసరత్తు ప్రారంభించింది. 'మహాలక్ష్మి' , 'గృహలక్ష్మి' స్కీమ్స్‌లో భాగంగా రూ. 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు వాడే వారికి ఉచిత కరెంట్ పథకాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తెల్లరేషన్ కార్డు ఉన్నవారందరికీ.. ఈ రెండు పథకాలు వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. అందులో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి రూ.80 కోట్ల విడుదలకు అనుమతిస్తూ పౌరసరఫరాల శాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. గ్యాస్ సిలిండర్ రాయితీ లబ్ధిదారులకు 'నగదు బదిలీ' విధానాన్నే అమలు చేయాలని డిసైడ్ అయింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్


# వేదిక పంచుకున్న రాహుల్, అఖిలేశ్ !

**మొదటిపేజీ తరువాయి**

కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వేదికపై రాహుల్‌తో పాటు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కూడా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర మిత్రపక్షాల మద్దతు కోసం చాలా కాలంగా వేచి ఉంది. రాహుల్ తన న్యాయ్ యాత్రతో పశ్చిమ బెంగాల్ చేరుకున్నప్పుడు, మమతా బెనర్జీ షాక్ ఇచ్చి యాత్రకు దూరంగా ఉన్నారు.

యాత్ర బెంగాల్ నుంచి బీహార్‌కు చేరుకోగానే నితీశ్ కుమార్ కూటమి మారి మళ్లీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేలో చేరి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. రాహుల్ బీహార్ నుండి ఉత్తరప్రదేశ్ వెళ్లినప్పుడు, అఖిలేష్ యాదవ్ రాహుల్ యాత్రలో పాల్గొంటారనే గ్యారెంటీ లేదు. ఎందుకంటే సీట్ల పంపకం పూర్తయిన తర్వాతే తాను భారత్ జోడో న్యాయ యాత్రలో చేరతానని అఖిలేష్ యాదవ్ స్వయంగా ప్రకటించారు. ఇండియా అలయన్స్‌లో ఉన్న పార్టీల మధ్య పొగమంచు కమ్ముకోవడం ప్రారంభించింది. కాంగ్రెస్‌కు చెందిన సమాజ్‌వాది పార్టీతో పాటు, ఆమ్ ఆద్మీ పార్టీతో కూడా చర్చలు ప్రారంభమయ్యాయి. అటువంటి పరిస్థితిలో, రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర ఆగ్రాకు చేరుకుంది. ఇందులో సమాజ్ వాదీ పార్టీకి చెందిన అఖిలేష్ యాదవ్ కూడా పాల్గొన్నారు. రాహుల్, అఖిలేష్, ప్రియాంకల రోడ్ షో తర్వాత సంయుక్త సమావేశం నిర్వహించారు. దాదాపు ఏడేళ్ల తర్వాత యూపీకి చెందిన ఇద్దరు కుర్రాళ్లు అఖిలేష్ యాదవ్, రాహుల్ గాంధీ మరోసారి ఒకే వేదికపై కనిపించారు. గతంలో 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు కలిసి పోటీ చేసినా తమ సత్తా చాటలేకపోయాయి. ఇక 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రీయ లోక్ దళ్ అధ్యక్షుడు జయంత్ చౌదరి ఎన్డీయేతో కలిసి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పాట్నా, బెంగళూరు, ముంబై, ఢిల్లీలో జరిగిన భారత కూటమి నాలుగు సమావేశాలకు హాజరైన తర్వాత ఆర్‌ఎల్‌డీ పార్టీ ఎన్‌డీఏలో చేరినప్పటికీ, ఈ ఉదయం అసలు పార్టీ స్థాపించింది భారతరత్న చౌదరి చరణ్ సింగ్ లోక్ దళ్ అని కాంగ్రెస్ వైపు వెళ్తున్నట్లు పార్టీ నేతలు చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే కార్యకర్తలు, నాయకులు భారత్ జోడో న్యాయ్ యాత్రకు, రాహుల్ గాంధీకి ఎంతో ఉత్సాహంతో స్వాగతం పలికారు.

# బీఆర్ఎస్‌లో అవమానం భరించలేక

- కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నరు..
- కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు శుభాకాంక్షలు
- 'హస్తం' పార్టీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం
- బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న అవమానాన్ని భరించలేక కాంగ్రెస్ పార్టీలోకి నాయకులు వస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అమరుల త్యాగాలపై ప్రభుత్వము ఏర్పాటు చేసుకొని తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలందరిని సంక్షేమ అభివృద్ధి వైపు నడిపించేందుకు కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల ఆధారంగా ఏర్పడిందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న అవమానాన్ని భరించలేక కాంగ్రెస్ పార్టీలోకి నాయకులు వస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి నాయకుడికి సముచిత స్థానం ఉంటుందన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు కారు దిగి హస్తం పార్టీలో చేరారు. తాజాగా జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి దంపతులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. అధినేత కేసీఆర్‌కు రాజీనామా లేఖ పంపారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంస్థ తెలంగాణ ట్రేడర్స్ సెల్ అధ్యక్ష పదవికి కూడా శోభన్‌రెడ్డి రాజీనామా చేశారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి మాజీ సీఎం కేసీఆర్ వెంటే ఉంటూ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. తార్నాకలో టీఆర్ఎస్ జెండా రెపరెపలాడింది తామేనని అన్నారు. అప్పటి నుంచి తెలంగాణవాదులుగా కొనసాగుతూ రాష్ట్రం ఏర్పడ్డాక తమకు గుర్తింపు వస్తుందని భావించి 2020లో జరిగే జీహెచ్‌ఎంసీ ఎన్నికలలోగా మేయర్ పదవిని కోరితే కేసీఆర్‌కు డిప్యూటీ మేయర్ పదవిని కేటాయించారు. ఆ తర్వాత భర్త శోభన్‌రెడ్డికి ఉప్పల్ అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని కోరగా.. కేటాయించలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

# 17కు 17 పార్లమెంట్ సీట్లు గెలుస్తాం

**మొదటిపేజీ తరువాయి**



ఆరోపించారు. అంతేకాకుండా కాంగ్రెస్ పై విరుచుకుపడ్డారు. అవినీతికి పెట్టింది పేరు కాంగ్రెస్.. ఆ పార్టీ నేతలు అవీనితి పరులని దుయ్యబట్టారు. కాంగ్రెస్ కు ఉన్న 40 సీట్లు కూడా ఇప్పుడు కాంగ్రెస్ కు రావని విమర్శించారు.దేశం గాడీలో ఉండాలంటే, మన పిల్లల భవిష్యత్ బాగుండాలంటే మోడీ నాయకత్వాన్ని ఆశీర్వారించాలని కిషన్ రెడ్డి కోరారు. రాజకీయాలకు అతీతంగా ఆలోచన చేయండి.. మెదక్ పార్లమెంట్ లో బీజేపీ గెలవాలని కిషన్ రెడ్డి అన్నారు. దేశంలో అనేక సమస్యలను మోడీ పరిష్కారించారు.. అవీనితి లేని పాలన అందిస్తున్నారని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యూరియా ధరలు పెరిగాయి.. కానీ పెరిగిన ధరలను కేంద్రమే సబ్సీడిగా భరిస్తుందని చెప్పారు. తెలంగాణలో రూ.2లక్షల రుణమాఫీ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు గ్యారంటీ లేదు, 6 గ్యారంటీలకు దిక్కు లేదు.. వాళ్ళు ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తారని మండిపడ్డారు. మాట తప్పిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు వదిలిపెట్టారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్ లో 4 ఎంపీ సీట్లు బీజేపీ గెలువబోతుంది.. ఇక కర్ణాటకలో గ్యారంటీల పేరుతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని.. ఇప్పుడు కర్ణాటక బీజేపీ వైపు ఉంది 25 ఎంపీ సీట్లను బీజేపీ గెలువబోతుందని అన్నారు. తెలంగాణలో అదే పరిస్థితి అని చెప్పారు. దేశంలో అభివృద్ధి చెందాలంటే మోడీ మళ్లీ రావాలి.. ఖచ్చితంగా మెదక్ పార్లమెంట్ నుండి గెలిపించాలని కిషన్ రెడ్డి కోరారు.



# కొనసాగుతున్న బీఆర్ఎస్ లీడర్ల రాజీనామాలు

- సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి రాజీనామా
- ఆయన కోడలు, రంగారెడ్డి జడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి కూడా..
- రేపు ప్రియాంకా గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరే అవకాశం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

లోక్ సభ ఎన్నికల వేళ.. బీఆర్ఎస్ కు మరో షాక్ తగిలింది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు కారు దిగి హస్తం పార్టీలో చేరారు. తాజాగా.. బీఆర్ఎస్‌కు మాజీ ఎమ్మెల్యే, మేయర్ తీగల కృష్ణారెడ్డి రాజీనామా చేశారు. కృష్ణారెడ్డితో పాటు రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో హైకమాండ్ తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా.. ఈ నెల 27న చేవెళ్లలో కాంగ్రెస్ నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ప్రియాంక గాంధీ పాల్గొననున్నారు. ఆమె సమక్షంలో తీగల కృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ సభలోనే ప్రియాంక సమక్షంలో తీగల ఫ్యామిలీ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం. కాంగ్రెస్‌లో చేరికకు ఇప్పటికే తీగల కృష్ణారెడ్డి లైన్ క్లియర్ చేసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యి కాంగ్రెస్‌లో జాయినింగ్‌కు రంగం సిద్ధం చేసుకున్నారు. కాగా, తీగల కృష్ణారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నుండి పోటీ చేయాలని భావించారు.

**కాంగ్రెస్‌లో చేరిన శ్రీలత శోభన్‌రెడ్డి దంపతులు**

ఇదిలా ఉంటే.. శనివారం బీఆర్ఎస్‌పార్టీకి రాజీనామా చేసిన జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి దంపతులు అధినేత కేసీఆర్‌కు రాజీనామా లేఖ పంపారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంస్థ తెలంగాణ ట్రేడర్స్ సెల్ అధ్యక్ష పదవికి కూడా శోభన్‌రెడ్డి రాజీనామా చేశారు. ఆదివారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ఆధ్వర్యంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ సమక్షంలో 'హస్తం' కండువాలు కప్పుకున్నారు.


# బ్యాంక్ ఖాతాల్లోకే రూ. 500 గ్యాస్ సబ్సిడీ!

**మొదటిపేజీ తరువాయి**

వర్తింప చేయనుంది. గృహ వినియోగదారుడు గడిచిన మూడేళ్లలో వాడిన సిలిండర్ల సగటు ఆధారంగా రాయితీ సిలిండర్ల సంఖ్య ఖరారు చేయనున్నారు. ప్రస్తుతానికి దాదాపు 40 లక్షల మహిళా లబ్ధిదారుల గుర్తించగా.. ఈ సంఖ్యతోనే పథకాన్ని ప్రారంభించనున్నారు.రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అందించే రాయితీ చెల్లింపులకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ప్లాట్‌ఫాంగా పనిచేస్తుందని పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. ఎస్‌బీఐ నోడల్ బ్యాంకుగా వ్యవహరిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అప్‌ఫ్రంట్ అమౌంట్ బ్యాంకులో ఉంటుందని చెప్పారు. రాయితీ సిలిండర్లు సరఫరా చేశాక ఎన్‌పీసీఐ నోడల్ బ్యాంకులో ఉన్న సొమ్ము నుంచి లబ్ధిదారుల ఖాతాలకు నిర్ణీత సబ్సిడీని బదిలీ చేస్తుందని వెల్లడించారు.

**సబ్సిడీ గ్యాస్ అర్హతకు సమస్యలు..**

అయితే, మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ పథకానికి 40 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులు అర్హులుగా ఉన్నట్లు ప్రభుత్వం ఇటీవల చెప్పింది.. అయితే సబ్సిడీ వంట గ్యాస్ స్కీంకు రేషన్‌కార్డు కు లింకు పెట్టడం ఆందోళన కలిగిస్తోంది. ఆహార భద్రత (రేషన్) కార్డులు కలిగిన నిరుపేద కుటుంబాలకు మాత్రమే సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్లు పొందేందుకు అర్హులు.. వంటగ్యాస్ కనెక్షన్‌దారుల్లో సగానికి పైగా కుటుంబాలకు రేషన్ కార్డులు లేవు. ముఖ్యంగా గత పదేండ్లలో అనేక కుటుంబాల్లోని సభ్యులు వివాహాలతో వేరుపడడం, కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంతో కార్డులు లేని కుటుంబాల సంఖ్య బాగా పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. అది సబ్సిడీ గ్యాస్ అర్హతకు సమస్యగా మారిందంటున్నారు. అంతేకాకుండా.. ప్రధాన మంత్రి ఉజ్వల కల్యాణ్ యోజన పథకం లబ్ధిదారులకు ఈ పథకం వర్తిస్తుందా లేదా..? అన్నది కూడా తెలియాల్సి ఉంది.



# చేవెళ్ల సభలో మరో రెండు గ్యారంటీలు అమలు ప్రకటిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

మార్చి నెలలో 200 యూనిట్లు లోపు విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అంతేకాకుండా.. డ్వాక్రా సంఘాలకు త్వరలో వడ్డీ లేని రుణాలు అందిస్తామని చెప్పారు. సోమవారం సాయంత్రం 43,000 మంది సింగరేణి కార్మికులకు కోటి రూపాయల బీమా పథకాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు.

కావలసినంత నాణ్యమైన విద్యుత్ అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం అన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పి భారీ ప్రాజెక్టులపై పంప్ స్టోరేజ్ కి ప్రణాళికలు చేస్తున్నామన్నారు. గత పదేళ్లుగా విద్యుత్ పాలసీ లేకపోవడంతో రాష్ట్రానికి ఎవరు రాలేదని తెలిపారు. త్వరలో కొత్త విద్యుత్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించబోతోందని పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్లలో సింగరేణిలో బొగ్గు పత్తిని 67 మిలియన్ టన్నుల నుంచి 100 మిలియన్ టన్నులకు పెంచుతాం.. రాష్ట్రంలోని బొగ్గు గనులన్నీ సింగరేణికే చెందాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సర్కులర్ జారీ చేసింది.. గత పదేళ్లుగా కనీస వేతన చట్టం లేక లక్షలాది కార్మికులు నష్టపోయారని డిప్యూటీ సీఎం తెలిపారు.

సీఎల్పీ నేతగా ప్రతి సభలోను ఆ అంశాన్ని ప్రశ్నించినా.. బీఆర్ఎస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం మాటలకే పరిమితం కావడంతో సింగరేణిలో ఉద్యోగుల సంఖ్య తగ్గిపోయిందని తెలిపారు. రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డకు ఉద్యోగం కల్పించడమే ఇందిరమ్మ సంక్షేమ రాజ్యము లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. సింగరేణిలో ప్రారంభించిన సౌర విద్యుత్ ప్రాజెక్ట్ రాష్ట్రానికే కాదు దేశానికి దిశా నిర్దేశం అని తెలిపారు. సింగరేణి సంపదను రాష్ట్ర ప్రజలకు, కార్మికులకు పంచుతామని అన్నారు. కరెంటు కావాలా? కాంగ్రెస్ కావాలా అని కేసీఆర్ ప్రశ్నిస్తే రాష్ట్ర ప్రజలు కరెంటు కావాలి కాంగ్రెస్ కావాలని తీర్పునిచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం ప్రారంభించిన భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాలు రాష్ట్రానికి గుదిబండలా మారాయని దుయ్యబట్టారు. విద్యుత్ సరఫరా విషయంలో కాంగ్రెస్ సర్కారు విఫలం చెందితే బాగుండు అని కొందరు మిత్రులు కలలు కంటున్నారని చెప్పారు.

# మోడీ మరో డేరింగ్ స్టంట్..

**మొదటిపేజీ తరువాయి**

చేశారు. ఇందుకు అవసరమైన పరికరాలను ధరించారు. అనంతరం నీటిలోకి దిగి పురాతన నగరం అవశేషాల వద్దకు చేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తన అనుభవాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకొన్నారు. ''సముద్ర గర్భాన ఉన్న ద్వారకాలో పూజలు చేయడం ఓ దివ్యానుభవం. పురాతన యుగాల్లోని కాలాతీత భక్తికి అనుసంధానమైన అనుభూతిని పొందాను. శ్రీకృష్ణుడు అందరినీ అనుగ్రహిస్తారు'' అని పోస్టులో పేర్కొన్నారు. దీనికి ఆ చిత్రాలను జతచేశారు. భారత్‌లోని సప్త మోక్షదాయక నగరాల్లో ద్వారక ఒకటిగా సంప్రదాయం చెబుతోంది. పశ్చిమ సముద్రతీరంలో సౌరాష్ట్ర(నేటి గుజరాత్)లో ద్వారకా పట్టణం ఉంది. దాన్ని 'ద్వారావతి' అనే పేరుతోనూ వ్యవహరించేవారు. అనేక ద్వారాలు ఉండటం వల్ల ఈ పేర్లు వచ్చాయని భావిస్తున్నారు. ద్వారకలో నందన, చైత్రరథ, మిశ్రక, వైభ్రాజ అనే నాలుగు ఉద్యానవనాలుండేవి. వైష్ణవ సంప్రదాయంలోని 108 దివ్య దేశాల్లో ఇది ఒకటి. మహాభారతం సభా, శాంతి పర్వాల్లో ద్వారకను గురించి అనేక విషయాల ప్రస్తావన ఉంది. జరాసంధుడు అనే రాక్షసుడి దాడుల నుంచి రక్షణ పొందేందుకు సురక్షితమైన ప్రాంతం కావాలన్న శ్రీకృష్ణుడి కోరికపై విశ్వకర్మ ద్వారకను నిర్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ సుందర నగరం అరేబియా సముద్రంలో మునగడంతో భక్తులెవరూ అక్కడికి వెళ్లలేకపోతున్నారు. ఈ ప్రాచీన నగరాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా గుజరాత్ ప్రభుత్వం జలాంతర్గామి సేవలను ప్రారంభించింది. ఇందుకోసం ముంబయికి చెందిన ప్రభుత్వ రంగ నౌకా సంస్థ మజ్‌గావ్ డాక్‌యార్డ్‌తో ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జలాంతర్గామికి 24మంది యాత్రికులను తీసుకెళ్లే సామర్థ్యం ఉంది. పర్యాటకులతో పాటు ఇద్దరు పైలట్లు, ఇద్దరు డైవర్లు, టెక్నీషియన్, గైడ్ కూడా ఉంటారు. ఇది భక్తులను అరేబియా సముద్రంలో 300 అడుగుల దిగువకు తీసుకెళ్తుంది.. అక్కడి నుంచి పురాతన నగర శిథిలాలతో పాటు అరుదైన సముద్ర జీవాలను చూడగలరు.

**'మన్ కీ బాత్ కి' బ్రేక్**

'మన్ కీ బాత్' కార్యక్రమానికి మూడు నెలల పాటు విరామం ఇస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. ఆదివారం నిర్వహించిన ఎపిసోడ్‌లో ఈ విషయం వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వచ్చే మూడు నెలల పాటు మన్ కీ బాత్‌ని కొనసాగించలేనని స్పష్టం చేశారు. మార్చి నెలలో అమల్లోకి వచ్చే అవకాశముందని, ఈ కారణంగానే మన్ కీ బాత్ కార్యక్రమానికి బ్రేక్ ఇవ్వక తప్పదని వివరించారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ మన్ కీ బాత్ కార్యక్రమానికి ఇదే విధంగా విరామం ఇవ్వాల్సి వచ్చింది. ఆ విషయాన్నే ప్రధాని మోడీ గుర్తు చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతను ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. రికార్డు స్థాయిలో పోలింగ్ జరిగేలా అందరూ ఓటు వేయాలని కోరారు. "మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రజల కోసమే పెట్టాం. ప్రజాస్వామ్య స్ఫూర్తితోనే దీన్ని కొనసాగిస్తున్నాను. కానీ.. లోక్‌సభ ఎన్నికల కారణంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వచ్చే నెలలో అమల్లోకి వచ్చే అవకాశముంది. అందుకే వచ్చే మూడు నెలల పాటు మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కొనసాగించడం కుదరదు. ఈ విరామం తరవాత 111వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో మీ అందరితో నేను మాట్లాడతాను. ఈ సంఖ్య చాలా శుభప్రదమైంది కూడా. లోక్‌సభ ఎన్నికల్లో యువత పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొని రికార్డు సృష్టించాలి' అని కోరుకుంటున్నానన్నారు.

# తెలంగాణ ఇంటర్ ఎగ్జామ్స్ హాల్ టికెట్లు విడుదల

- స్టూడెంట్లు డౌన్‌లోడ్‌చేసుకునే వెసులుబాటు
- ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఎగ్జామ్స్
- ఎగ్జామ్స్‌రాయనున్న 9. 8 లక్షల మంది స్టూడెంట్లు
- ఇంటర్‌మీడియట్‌బోర్డు అధికారుల వెల్లడి

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణ ఇంటర్ ఎగ్జామ్స్ హాల్ టికెట్లు ఆదివారం విడుదలయ్యాయి. వాటిని ఇంటర్మీడియట్ బోర్డు ఆన్ లైన్ లో రిలీజ్ చేసింది. కాగా.. ఇంతకుముందు కాలేజీల ప్రిన్సిపాల్స్‌లాగిన్ ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్ కు అవకాశం ఉండేది. కానీ తాజాగా.. స్టూడెంట్లే నేరుగా హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించింది. అయితే.. అధికారిక వెబ్ సైట్ tsbie.cgg.gov.in నుంచి విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని ఇంటర్మీడియట్ బోర్డు తెలిపింది. ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు జరగనున్నాయి. ఈ సంవత్సరంలో 9.8 లక్షల మందికి పైగా విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్నారని బోర్డు తెలిపింది.

**ఇలా డౌన్‌లోడ్‌చేసుకోవాలి**

1. TSBIE అధికారిక వెబ్‌సైట్ tsbie.cgg.gov.in ను సందర్శించండి.
2. ఆ తర్వాత హోమ్‌పేజీలో తెలంగాణ ఇంటర్ ఫస్టియర్ లేదా సెకండియర్ హాల్ టికెట్ కోసం లింక్‌పై క్లిక్ చేయండి.
3. లాగిన్ పేజీలో టీఎస్ ఇంటర్ ప్రథమ లేదా ద్వితీయ సంవత్సరం హాల్ టికెట్ కోసం రోల్ నంబర్ లేదా మునుపటి సంవత్సరం హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేయండి.
4. ఆ తర్వాత హాల్ టికెట్ డిస్ ప్లే అవుతుంది. డౌన్‌లోడ్ చేసుకోండి.

**పరీక్ష తేదీలు**

తెలంగాణ ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ఫిబ్రవరి 28న ప్రారంభమై మార్చి 18 వరకు జరుగుతాయి. సెకండియర్ పరీక్షలు ఫిబ్రవరి 29న ప్రారంభమై మార్చి 19 వరకు జరుగుతాయి. అయితే ఈ పరీక్షలను ఒకే షిఫ్ట్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు.

**ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షల షెడ్యూల్**

2802- 2024 - సెకండ్ లాంగ్వేజ్ పేపర్I
01 032024 - ఇంగ్లీష్ పేపర్I
04032024 - గణితం పేపర్IA / బోటనీ పేపర్I / పొలిటికల్ సైన్స్ పేపర్I
0603 2024 - మ్యాథమెటిక్స్ పేపర్IB / జువాలజీ పేపర్I / హిస్టరీ పేపర్I
11- 03-2024 - ఫిజిక్స్ పేపర్I / ఎకనామిక్స్ పేపర్I
13032024 - కెమిస్ట్రీ పేపర్I / కామర్స్ పేపర్I
15 032024 - పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్I / బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్ పేపర్I
18 032024 - మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్I / జియోగ్రఫీ పేపర్I

**ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షల షెడ్యూల్**

29022024 - సెకండ్ లాంగ్వేజ్ పేపర్II
02032024 - ఇంగ్లీష్ పేపర్II
05032024 - గణితం పేపర్IIA / బోటనీ పేపర్II / పొలిటికల్ సైన్స్ పేపర్II
07032024 - మ్యాథమెటిక్స్ పేపర్IIB / జువాలజీ పేపర్II / హిస్టరీ పేపర్II
12032024 - ఫిజిక్స్ పేపర్II / ఎకనామిక్స్ పేపర్II
14032024 - కెమిస్ట్రీ పేపర్II / కామర్స్ పేపర్II
16032024 - పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్II / బ్రిడ్జ్ కోర్సు మ్యాథ్స్ పేపర్II
19032024 - మోడరన్ లాంగ్వేజ్ పేపర్II / జియోగ్రఫీ పేపర్II

# సారీ.. నేను రాలేను

**మొదటిపేజీ తరువాయి**

ఏ పరిస్థితుల్లో నోటీసులు ఇచ్చారో స్పష్టత లేదన్నారు. నోటీసు జారీ చేసిన సందర్భం కూడా అందర్నీ ఆలోచింపజేసేలా ఉందన్నారు. 2022 డిసెంబరులో అప్పటి ఐవో ఇదే తరహా నోటీసును సెక్షన్ 160 కింద ఇచ్చారని.. గతంలో జారీ చేసిన సెక్షన్ 160 నోటీసుకు ప్రస్తుత సెక్షన్ 41ఏ నోటీసు పూర్తి విరుద్ధంగ ఉందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. మరోవైపు త్వరలో పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నోటీసులు ఇవ్వడం పలు ప్రశ్నలకు తావునిస్తోందన్నారు. ఎన్నికల ప్రచార బాధ్యతలు ఉన్నందున ఢిల్లీకి పిలవడం అనేది ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా అవరోధం కలిగిస్తుందని స్పష్టం చేశారు. ఇది నా ప్రజాస్వామిక, రాజ్యంగ హక్కులకు భంగం కలిగిస్తుందని, సీబీఐ చేస్తున్న ఆరోపణల్లో తన పాత్ర ఏమీ లేదని... పైగా కేసు కోర్టులో పెండింగ్ లో ఉందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ నోటీసులు జారీ చేయగా ఆమె సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దాంతో ఆ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్ లో ఉందని తెలిసిందే. తనను విచారణకు పిలవబోమని అదనపు సొలిసిటర్ జనరల్ సుప్రీం కోర్టుకు హామీ ఇచ్చారని.. సుప్రీం కోర్టులో ఇచ్చిన రిలాక్సేషన్ సీబీఐకి విషయంలోనూ వర్తిస్తుందని కవిత అభిప్రాయపడ్డారు.



# ఎన్నికల పర్యటనకు రాజ్‌నాథ్ సింగ్, మల్లికార్జున ఖర్గే

- హీట్ ఎక్కిస్తున్న రాష్ట్ర పాలిటిక్స్
- 26న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- 27న రాజ్‌నాథ్ సింగ్

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** రాష్ట్రంలో ఎండల వేడిని మించి ఎన్నికల సెగ మొదలైంది. సీఎం జగన్‌తో పాటు ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ, కాంగ్రెస్ నేతల వరుస సమావేశాలతో మండే నుంచి ఏపీలో ఎన్నికల మంటలు మొదలు కానున్నాయి. 26వ తేదీన కుప్పంలో పర్యటించనున్న సీఎం జగన్.. హంద్రీ నీవా జలాలను విడుదల చేయనున్నారు. దీనివల్ల వేల ఎకరాలకు సాగు నీటితో పాటు కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 2 లక్షలమందికి తాగు నీరు అందుతుందన్నారు మంత్రి పెద్దిరెడ్డి. ఈసారి కుప్పంలో ఎమ్మెల్యేగా భరత్ ను గెలిపిస్తే మంత్రిని చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారన్నారు పెద్దిరెడ్డి. ఇక అదే 26 డేటునే ఏపీలో ఎన్నికల హీటు పెంచుతామంటోంది కాంగ్రెస్. ఆ రోజున ఏపీకి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రానున్నారు. అనంతపురం నుంచి ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. అనంత వేదికగా జరిగే బహిరంగ సభలో ఖర్గే ముఖ్యమైన ప్రకటన చేయబోతున్నారన్నారు కాంగ్రెస్ నేత గిడుగు. ఇక ఈ నెల 27న ఏపీకి కేంద్ర రక్షణమంత్రి రాజ్ నాథ్‌సింగ్ రానున్నారు. కమల దళాన్ని ఎన్నిలకు ఆయన సమాయత్తం చేయనున్నారు. విశాఖలో మేధావులతో సమావేశమయ్యాక పార్టీ పార్లమెంటు క్లస్టర్ల మీటింగులలో రాజ్ నాథ్ పాల్గొంటారు. ఎన్నికలపై ఏపీ బీజేపీ కేడర్‌కు దిశానిర్దేశం చేస్తారు. ఇక పొత్తుల విషయాన్ని అధిష్టానమే చూసుకుంటుందని, తాము మాత్రం ఎన్నికలకు పూర్తిస్థాయిలో సమాయత్తం అవుతున్నామన్నారు.

# 15 లక్షల మందితో వైసీపీ భారీ బహిరంగ సభ

- భీమిలిలో వైసీపీ సమరశంఖం పూరించింది
- అద్దంకిలో సిద్ధం ముగింపు సభకు ప్లాన్ చేస్తోంది
- 200 ఎకరాల్లో ముగింపు సభ



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** భీమిలిలో వైసీపీ సమర శంఖం పూరించింది. దెందులూరులో యుద్ధానికి సిద్ధమని ప్రకటించింది. రాప్తాడు సభతో వైసీపీ దమ్మేంటో చూపించింది. ఇక చరిత్రలో నిలిచిపోయేలా అద్దంకిలో సిద్ధం ముగింపు సభకు ప్లాన్ చేస్తోంది వైసీపీ. ఇంతకీ ఈ సభకు ఏయే పార్లమెంట్ సెగ్మెంట్ల నుంచి కార్యకర్తలు రాబోతున్నారు? ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయి? ఎన్ని లక్షల మంది హాజరుకానున్నారు.. అనేది ఆసక్తికరంగా మారింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలోనే అభ్యర్థుల మార్పులు చేర్పులపై కొంతవరకు కసరత్తు పూర్తి చేసిన సీఎం జగన్.. ఆ తర్వాత ఎన్నికల ప్రచారంలోకి దిగారు. సిద్ధం పేరుతో ఏపీలోని నాలుగు ప్రాంతాలను కవర్ చేసేలా భారీ బహిరంగ సభలకు వైసీపీ ప్లాన్ చేసింది వైసీపీ. అందులో భాగంగా భీమిలిలో నిర్వహించిన తొలి సిద్ధం సభ గ్రాండ్ సక్సెస్ అయింది. రెండో సిద్ధం సభతో దెందులూరు దద్దరిల్లింది. ఇక రాప్తాడుకు జనసంద్రమే తరలివచ్చింది. అంతకు మించి అనేలా.. రాయలసీమ చరిత్రలోనే ఏ సభకూ రానంత మంది జనం ఈ సభకు హాజరయ్యైనట్లు పార్టీ స్పష్టం చేసింది. వైసీపీ లెక్కల ప్రకారం ఈ సభకు 10లక్షల మంది హాజరయ్యారు. ఇక నాలుగో సభ.. ముగింపు సభను అద్దంకి నియోజకవర్గంలోని మేదరమెట్లలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాప్తాడు సభను 110 ఎకరాల్లో ఏర్పాటు చేస్తే.. ముగింపు సభ కోసం 200 ఎకరాలు సేకరించారు. వచ్చే నెల 3న జరిగే ఈ సభకు నెల్లూరు, తిరుపతి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని 54 నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జనాల్ని తరలించేందుకు పార్టీ శ్రేణులు కసరత్తు చేస్తున్నాయి. ఈ ఏర్పాట్లపై సన్నాహక సమావేశాన్ని ఎంపీ విజయసాయిరెడ్డి నిర్వహించారు. 15 లక్షల మంది ఈ సభకు వస్తారని ఆయన అంచనా వేశారు. మొత్తంగా ఇది చివరి సిద్ధం సభ కావడంతో మిగతా మూడు సభలను తలదన్నేలా విజయవంతం చేయడానికి పార్టీ సన్నాహాలు చేస్తోంది

# రాష్ట్రానికి మోదీ సర్కార్ గుడ్ న్యూస్

- 34 అమృత్ భారత్ స్టేషన్లు
- సోమవారం శంకుస్థాపన చేయనున్న మోదీ
- వీటి అభివృద్ధి కోసం రూ.610.30 కోట్లు ఖర్చు



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** ఎన్నికల వేళ ఏపీకి కేంద్రం శుభవార్త చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 34 అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌లను నిర్మించనున్నట్లు తెలిపింది. అమృత్ భారత్ స్టేషన్ల రీడెవలప్‌మెంట్‌లో భాగంగా ఏపీలో 34, తెలంగాణలో 15 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫిబ్రవరి 26 ( సోమవారం) వీటికి శంకుస్థాపన చేయనున్నారు. రూ.843.54 కోట్లతో ఈ రైల్వే స్టేషన్‌లను ఆధునీకరించనున్నారు. మరోవైపు సోమవారం దేశవ్యాప్తంగా 500లకుపైగా అమృత్ భారత్ స్టేషన్లకు వర్చువల్ విధానం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అలాగే 1500 రైల్వే ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లకు భూమిపూజ చేస్తారు. అమృత్ భారత్ స్టేషన్స్ స్కీమ్‌లో భాగంగా.. రైల్వే స్టేషన్లను ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దాలనేది ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచన. ఈ స్కీమ్‌లో భాగంగా ఏపీలో మొత్తం 72 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. తొలి దశలో అనకాపల్లి, భీమవరం, ఏలూరు, కాకినాడతో పాటుగా, నర్సాపూర్, నిడదవోలు, ఒంగోలు, సింగరాయకొండ, తాడేపల్లిగూడెం, తెనాలి, తుని రైల్వే స్టేషన్లను కేంద్రం గుర్తించింది. వీటి అభివృద్ధికి రూ.270 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఈ స్టేషన్‌లలో పనులు జరుగుతున్నాయి. తాజాగా మరో 34 స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్లుగా తీర్చిదిద్దాలని కేంద్రం నిర్ణయించింది.



# హీట్ పెంచుతున్న పులివెందుల పాలిటిక్స్

- సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా పులివెందుల పాలిటిక్స్
- సతీష్ రెడ్డి ఇంటికి క్యూ కట్టిన నేతలు

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** కడప జిల్లాలోని సీఎం సొంత నియోజకవర్గం పులివెందులలో రాజకీయాలు హాట్ హాట్‌గా మారాయి. తన రాజకీయ ప్రత్యర్థిన సతీష్ రెడ్డిని పార్టీలోకి చేర్చుకోవాలంటూ సీఎం కడప జిల్లా నేతలకు సూచించడంతో వైసీపీ నేతలు సతీష్ రెడ్డి ఇంటికి వెళ్లి పార్టీలో చేరాలంటూ ఆహ్వానించా.రు అయితే ఆ విషయంపై కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకుని తెలియజేస్తానని చెప్పటంతో.. అటు తెలుగుదేశం పార్టీ నేతలకు గట్టి షాక్ ఇచ్చారు. వెంటనే టీడీపీ నేతలు అలర్ట్ అయ్యారు. ఆదివారం తెల్లవారుజామునే సతీష్ రెడ్డి నివాసానికి చేరుకుని టీడీపీలోనే కొనసాగాలంటూ మంతనాలు చేశారు. అయితే వారితో కూడా సతీష్ రెడ్డి చాలా సున్నితంగా మాట్లాడి కార్యకర్తల నిర్ణయం మేరకు తన నిర్ణయాన్ని తెలియజేస్తానని చెప్పారు. అయితే గత కొంతకాలంగా పులివెందుల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న బీటెక్ రవి వ్యూహంలో భాగంగానే సతీష్‌రెడ్డిని కావాలనే పార్టీకి దూరం చేశాడని స్థానిక టీడీపీ నేతలు అంటున్నారు. బిటెక్ రవి సతీష్ రెడ్డి దగ్గరికి ఎందుకు వెళ్ళాడో తెలియడంలేదని అతని వర్గం అంటున్నారు. గత నాలుగున్నర ఏళ్ళుగా లేని ప్రేమ ఇప్పుడు ఎందుకు సతీష్ రెడ్డిపై పుట్టుకొచ్చిందో అందరికీ తెలుసని ఎద్దేవా చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సతీష్ రెడ్డి అవసరం ఉంది. అందుకే ఆయన దగ్గరకు వెళ్లారని సతీష్ రెడ్డి వర్గం మండిపడుతోంది. గత నాలుగేళ్లుగా సతీష్‌రెడ్డిని కలుపుకోకపోగా ఈరోజు ముసలి కన్నీరు కారుస్తున్నాడని బీటెక్ రవిపై ధ్వజమెత్తారు. పులివెందులలోని తెలుగు దేశం పార్టీ కిందిస్థాయి నేతలను దూరం పెడుతూ తన సొంత మండలం అయిన సింహాద్రిపురంలోనే తన నాయకత్వాన్ని నిలుపుకోలేకపోతున్నారని బీటెక్ రవిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు టీడీపీకి దశాబ్దాల కాలం పాటు సేవ చేసి పార్టీకి అండగా నిలబడి అక్కడే అవమానించబడ్డ సతీష్ రెడ్డిని కలవడానికి రావడం పై ఇదంతా ఎన్నికల కోసమేనని సతీష్ రెడ్డి వర్గం అంటుంది. ఏ పార్టీలో చేరాలి అనే విషయంపై కార్యకర్తలతో మాట్లాడిన తర్వాత నిర్ణయం తీసుకుంటానని తెలిపిన సతీష్‌రెడ్డి, రెండు రోజుల తర్వాత తన నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.



# పవన్ దేహీ అని చేయి చాచడం ఏంటీ..?

- జనసేన పరిస్థితి అంత హీనంగా ఉందా హరిరామజోగయ్య
- జనసైనికులు సంతృప్తి చెందేలా సీట్ల పంపకం ఉందా
- ఏ ప్రాతిపదికన సీట్ల పంపకం చేశారు హరిరామజోగయ్య

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** టీడీపీ, జనసేన సీట్ల పంపకంపై కాపు సంక్షేమ నేత చేగొండి హరిరామ జోగయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం 24 సీట్లు తీసుకునేంత బలహీనంగా జనసేన ఉందా ఆంటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు సంచలన లేఖ రాశారు. పంపకం జరిగిన 118 సీట్లలో కమ్మవారికి 24 సీట్లు, రెడ్లకు 17 సీట్లు, కావులకు 15 సీట్లు, బి.సి.లకు 25 సీట్లు ఇచ్చారన్న హరిరామ జోగయ్య.. ఏ ప్రాతిపదికన సీట్ల పంపకం చేశారని ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయంగా బి.సి.లకు 50 శాతం, కావులకు 25 శాతం, కమ్మ సామాజికవర్గానికి 4 శాతం, రెడ్లకు 6 శాతం సీట్లు దక్కాల్సి ఉంటుందన్నారు. సామాజిక న్యాయం అనుసరిస్తూ అన్ని కులాలకు జనాభా ప్రాతిపదికన సీట్ల పంపకం జరిగిందా అని ప్రశ్నించారు. అలాగే సీట్ల పంపకంలో జనసేనకు కేటాయించిన 24 అసెంబ్లీ, 3 పార్లమెంటు సీట్లు జన సైనికుల సంతృప్తి మీద జరిగాయా అంటూ హరిరామ జోగయ్య లేఖలో ప్రశ్నించారు. అయినా ఒకరు ఇవ్వటం, మరొకరు దేహీ అంటూ పుచ్చుకోవటం పొత్తు ధర్మం అనిపించుకుంటుందా? అని లేఖలో ప్రశ్నించారు. సీట్ల పంపకంలో తెలుగుదేశం యివ్వటం, చేయి జాచి జనసేన తీసుకోవటం ఏమిటి? అంటూ ఘాటుగా విమర్శించారు. జనసేనపార్టీకి 24 సీట్లకు మించి నెగ్గగల స్తోమత లేదా? జనసేన పరిస్థితి ప్రజలలో అంత హీనంగా ఉందా? ఈపంపకం కూడా రాష్ట్ర ప్రయోజనాలకు మాత్రమే అని పవన్ కళ్యాణ్ చెప్పగలరా? అని హరిరామ జోగయ్య ప్రశ్నించారు. జనసేనకు 50 నుంచి 60 సీట్లు దక్కాల్సిందన్న హరిరామ జోగయ్య.. ఆ మేరకు ఆర్థికంగా, సామాజికంగా బలమైన నేతలను కూడా గుర్తించినట్లు చెప్పుకొచ్చారు. ఆయా నియోజకవర్గాలలో వివిధ కులాలకు సంబంధించి బలమైన అభ్యర్థుల పేర్లను కూడ ప్రకటించటం జరిగిందని అన్నారు. "జనసేన శక్తిని పవన్ కళ్యాణ్ గారు ఎందుకు తక్కువ అంచనా వేసుకుంటున్నారో తెలియటం లేదు. ఏది ఏమైనా ఈ 24 నియోజకవర్గాలు కేటాయింపు అధిక సంఖ్యాకులైన జనసైనికులను సంతృప్తిపరచని మాట వాస్తవం. వారు కోరుకుంటున్నది రాజ్యాధికారంలో తమకు గౌరవమైన వాటా, అదీ సీట్ల పంపకంలో. జరిగినప్పుడే పరిపాలనాధికారం కూడ దక్కుతుందనేది వారి వాదన. తాము కలలు కంటున్నట్లుగా... పొత్తులో భాగంగానైనా తమ అధినేత పవన్ కళ్యాణ్ కనీసం రెండున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చూడాలన్నది వారి కోరిక . తక్కువ సంఖ్యలో జనసేనకు సీట్ల కేటాయింపు ద్వారా ముందు ముందు తమకు అధికారంలో రావాల్సిన వాటా రాకుండా పోతుందేమోనన్నది వారి ఆవేదన. అధికారం చేజిక్కించుకోకుండా పవన్ కళ్యాణ్ కలలుగంటున్న రామ రాజ్యం స్థాపించుకోలేమన్నది జనసైనికుల భయం. పవన్ కళ్యాణ్ లేకుండా తామందరూ కోరుకుంటున్న నీతివంతమైన పరిపాలన సాగదేమోననేది వారి ఆందోళన" అని హరిరామ జోగయ్య లేఖలో పేర్కొన్నారు.

# పవన్ కళ్యాణ్ రాజకీయాలకు పనికిరారు

- మంత్రి రోజా కీలక వ్యాఖ్యలు
- తిరుపతిలో మీడియాతో మాట్లాడిన రోజా
- టీడీపీ , జనసేన జాబితాతో వైసీపీ విజయం ఖాయం



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** టిడిపి జనసేన అభ్యర్థుల ఉమ్మడి జాబితాపై తనదైన శైలిలో రియక్ట్ అయ్యారు మంత్రి ఆర్కే రోజా. తిరుపతిలో మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి ఆర్ కే.రోజా టిడిపి జనసేన అభ్యర్థుల ఉమ్మడి జాబితాను చూసి ఆ పార్టీల కార్యకర్తలు ఏడుస్తున్నారన్నారు. టిడిపి, జనసేన ఉమ్మడి జాబితా చూసాక 175 స్థానాలు కొడతామన్న ధీమాతో వైసీపీ శ్రేణుల్లో డబుల్ అయిందన్నారు. అందుకే సంబరాలు జరుపు కుంటున్నారని తెలిపారు. పవర్ షేరింగ్, సీట్ షేరింగ్ అన్న పవన్ కళ్యాణ్ పావలా షేర్ సీట్లు కూడా తీసుకోలేదన్నారు మంత్రి రోజా. ఏ ప్యాకేజీ కోసం 24 సీట్లకే చంద్రబాబు కాళ్ళు పట్టుకున్నారో ఆ పార్టీ కేడర్‌కు పవన్ కళ్యాణ్ చెప్పాలని రోజా డిమాండ్ చేశారు. 24 సీట్లకే ఎందుకు తల వంచారో కూడా పవన్ జనసేన కార్యకర్తలకు చెప్పాలన్నారు.పవన్ కళ్యాణ్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. పవన్ కళ్యాణ్ ఎక్కడి నుంచి పోటీ చేయాలో చంద్రబాబు చెప్పాల్సిన దౌర్భాగ్య పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర భవిష్యత్ కోసం పొత్తు అంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. రాష్ట్రం విడిపోయాక చంద్రబాబుకు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. రాష్ట్ర ప్రజల సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. ప్యాకేజీ కోసం ప్రత్యేక హోదా తాకట్టు పెట్టారని విమర్శించారు. కమీషన్ల కోసం పోలవరంను తాకట్టు పెట్టారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ కోసం అమరావతిని చంద్రబాబు తాకట్టు పెట్టారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 24 సీట్ల కోసం పవన్ కళ్యాణ్ కాపు సామాజిక వర్గ ప్రజల ఆత్మ గౌరవాన్ని చంద్రబాబుకు తాకట్టు పెట్టారని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. పవన్ కళ్యాణ్ రాజకీయాలకు పనికి రాడన్నారు మంత్రి ఆర్కే రోజా.

# గ్రూప్1 పరీక్ష వాయిదా పడనుందా..?

- మార్చి 17వ తేదీన గ్రూప్ 1 పరీక్ష
- క్లారిటీ ఇచ్చిన ఛైర్మన్ గౌతమ్ సవాంగ్
- 81 పోస్టుల భర్తీ

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** ప్రభుత్వం గ్రూప్ 1 పరీక్షకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. మార్చి 17వ తేదీన గ్రూప్ 1 పరీక్ష జరగనుందని ఇప్పటికే ఏపీపీఎస్సీ ప్రకటించింది. అయితే తాజాగా ఈ పరీక్షలు వాయిదా పడనున్నాయని వార్తలు వచ్చాయి. మార్చి 17న జరగనున్న పరీక్ష వాయిదా పడనుంది. అంటూ కొన్ని వార్తలు షికార్లు చేస్తున్నాయి. దీంతో ఈ వార్తలపై ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ స్పందించారు. మార్చి 17వ తేదీన గ్రూప్1 పరీక్ష యథావిధిగా ఉంటుందని, అభ్యర్థులు ఎలాంటి వదంతులను నమ్మవద్దని స్పష్టం చేశారు. పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. దీంతో పరీక్ష వాయిదాపై జరుగుతోన్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడింది. ఇదిలా ఉంటే గ్రూప్ 1 నోటిఫికేషన్‌లో భాగంగా 81 పోస్టులను భర్తీ చేయనున్న విషయం తెలిసిందే. వీటిలో 9 డిప్యూటీ కలెక్టర్లు, 18 అసిస్టెంట్ ట్యాక్స్ కమిషనర్స్ పోస్టులు, 26 డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్స్, ఆర్టీవో, గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్స్, జిల్లా బీసీ సంక్షేమ వంటి ఉన్నత స్థాయి పోస్టులు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఆదివారం ఏపీలో గ్రూప్2 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 899 గ్రూప్2 ఉద్యోగాలకు ఏపీపీఎస్సీ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. పరీక్ష తీరును ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ పర్యవేక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 4.63 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. చిత్తూరు జిల్లాలో ఫేక్ అడ్మిట్ కార్డుతో వచ్చిన వ్యక్తిని పట్టుకున్నామని ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ తెలిపారు. జూన్ లేదా జులైలో గ్రూప్2 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు వెల్లడిస్తాం అని ఆయన తెలిపారు.

# జనసేనకు మరో పది సీట్లు..!

- జనసేనకు మరో పది సీట్లు
- జనసేన సీనియర్ లీడర్ వెల్లడి
- వారంలో స్పష్టత వస్తుందని వ్యాఖ్యలు



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల జాబితాపై జనసైనికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మరీ 24 సీట్లకే జనసేన పరిమితం కావటం మీద జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు మండిపడుతున్నారు. కనీసం 40 అసెంబ్లీ స్థానాల్లో జనసేన పోటీ చేయాల్సిందని అంటున్నారు .బొలిశెట్టి సత్యనారాయణ వంటి నేతలు కూడా జనసేనకు 24 సీట్లు కేటాయించడం మీద బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్‌కు సైతం ఈ నిర్ణయం ఇష్టం ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో జనసేన సీట్ల కేటాయింపునకు సంబంధించి ఆ పార్టీ నేత కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ నేత, అనకాపల్లి అభ్యర్థి కొణతాల రామకృష్ణ పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించే సీట్లకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో కొణతాల రామకృష్ణ ఆదివారం రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం అనకాపల్లి పట్టణంలోని స్థానిక నూకాలమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యదర్శి, సిబ్బంది, వేద పండితులు కొణతాలకు స్వాగతం పలికి శాలువా కప్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కొణతాల రామకృష్ణ.. జనసేన, టీడీపీ అభ్యర్థిగా రెండు పార్టీల నాయకులను, కేడర్‌ను కలుపుకుని వెళ్లి పవన్ కళ్యాణ్ నిర్ణయం మేరకు పార్టీ బలోపేతానికి, విజయాన్ని కృషి చేస్తానని అన్నారు. పార్టీ మొదట విడతగా రాష్ట్రవ్యాప్తంగా 24 చోట్ల పోటీ చేయనున్నట్లు ప్రకటించిందన్న కొణతాల రామకృష్ణ.. బీజేపీతో కూడా పొత్తుపై చర్చలు జరుగుతున్నాయని అన్నారు. వచ్చే వారం రోజుల్లోగా దీనిపై క్లారిటీ వస్తుందని చెప్పారు. బీజేపీతో పొత్తును అనుసరించి జనసేనకు మరో 10 సీట్లు రావడానికి అవకాశం ఉందని కొణతాల రామకృష్ణ చెప్పారు.

# రైతులకు శుభవార్త

- ఫిబ్రవరి 28న రైతుభరోసా నిధుల విడుదల
- సున్నవడ్డీ రాయితీని విడుదల చేయనున్న జగన్
- ఏకంగా 64.37 లక్షల మందికి లబ్ధి



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** ఏపీలోని రైతులకు జగన్ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. 202324 సీజన్‌కు సంబంధించి వైఎస్ఆర్ రైతు భరోసా మూడో విడత నిధులను ఎప్పుడు విడుదల చేసేదీ ప్రకటించింది. వైఎస్ఆర్ రైతు భరోసా మూడో విడత పెట్టుబడి సాయంతో పాటు సున్నా వడ్డీ రాయితీ సొమ్మును సీఎం వైఎస్ జగన్ ఫిబ్రవరి 28వ తేదీన రైతుల అకౌంట్లో జమ చేయనున్నారు. ఈ మేరకు రైతుభరోసా పెట్టుబడి సాయం కింద అర్హులైన రైతులకు రెండు వేల చొప్పున అకౌంట్లోకి జమచేస్తారు. మొత్తంగా రైతు భరోసా, సున్నా వడ్డీ రాయితీ కింద అర్హులైన 64.37 లక్షల రైతు కుటుంబాలకు రూ.1,294.34 కోట్ల సాయం అందించనున్నారు. రైతు భరోసా మూడో విడత పెట్టుబడి సాయం కింద 53.58 లక్షల మంది రైతులకు ఒక్కొక్కరికి రెండు వేల రూపాయల చొప్పున రూ.1,078.36 కోట్లు జమ చేయనున్నారు. అలాగే 202122 రబీ సీజన్, 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 10.79 లక్షల మంది రైతులకు సున్నా వడ్డీ రాయితీ కింద రూ.215.98 కోట్లు జమ చేస్తారు.తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ఈ సొమ్మును రైతు ఖాతాల్లో జమ చేయనున్నారు. పీఎం కిసాన్, రైతు భరోసా పథకం కింద కేంద్రం అందించే ఆరువేల రూపాయలతో కలిపి ఏటా 13వేల 500 రూపాయలను ఏపీ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. అర్హులైన రైతులకు మూడు విడతల్లో ఈ సాయం అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా 2023-24 సంవత్సరం తొలి విడతలో 52,57,263 రైతు కుటుంబాలకు రూ.3,942.95 కోట్ల సాయం అందించారు. ఇక రెండో విడతలో 53,52,905 కుటుంబాలకు రూ.2,204.77 కోట్లు సాయం అందించారు. మూడో విడతలో భాగంగా ఫిబ్రవరి 28న 53,58,368 రైతు కుటుంబాలకు రూ.1,078.36 కోట్లు జమచేయనున్నారు.

# ప్రజలకు చల్లని కబురు

- ద్రోణి విదర్భ, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా కోస్తా ఆంధ్ర వరకు ఆవరించి
- సముద్రమట్టానికి దాదాపు కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్న ద్రోణి
- రాయలసీమలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి వర్షా లు



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** వేసవి రాక ముందే వేడితో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు చల్లని కబురు చెప్పింది వాతావరణ శాఖ. ఉపరితల ఆవర్తనానికి ద్రోణులు తోడు కావడంతో రెండు రోజులపాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. వేసవి రాక ముందే తెలుగు రాష్ట్రాల్లో ఎండలు తారెత్తిస్తున్నాయి. వేడి, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. అయితే ఒకేసారి రెండు ద్రోణులు ఏర్పడడం, దీనికి ఉపరితల ఆవర్తనం తోడు కావడంతో వాతావరణం చల్లబడుతుందంటోంది వాతావరణ శాఖ. రెండు తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో రెండు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరో ద్రోణి విదర్భ, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా కోస్తా ఆంధ్ర వరకు ఆవరించి ఉంది. ఆవర్తనం, ద్రోణి సముద్రమట్టానికి దాదాపు కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నాయి. వీటి ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓ మోస్తరు వానలు కురుస్తాయి. ఉత్తర కోస్తాలో ఆది, సోమవారం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దక్షిణ కోస్తాలో కూడా పరిస్థితి అలాగే ఉంటుందని అంచనా వేసింది. రాయలసీమ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి వర్షాలు పడతాయని వాతావరణ నిపుణులు అంచనా వేశారు.



# ఉచిత కంటి అద్దాలు పంపిణీ

**రామన్నపేట, విశాలభారతి:** మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో జనవరి 26వ తేదీన లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈసీఐఎల్ ఈ లైట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 53 మందికి కంటి శస్త్ర చికిత్స చేయించారు.ఆదివారం నాడు 88 మందికి కళ్ళజోడు అందజేశారు. అంతేకాకుండా ఉచిత మందులు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన వారిలో క్లబ్ సభ్యులు మొలుక రామచంద్రయ్య,కక్కునూరి శ్రీకాంత్,కవిటి రామకృష్ణ,పాదం దామోదర్ ఉన్నారు.ఈ కార్యక్రమంలో కాటేపల్లి యాదయ్య,పెద్దగోని వెంకటేశం,సింగనబోయిన గణేష్ యాదవ్,గర్దాసు సురేష్,పబ్బ రమేష్,ఎర్రం దాసు,మండల జానయ్య తదితరులు పాల్గొన్నారు.




# జిమ్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలో తంగేడి పల్లి రోడ్డు పక్కన ఫిట్నెస్ పార్క్ న్యూ జిమ్ ను ప్రారంభం చేసిన మున్సిపల్ చైర్మణ్ వెన్ రెడ్డి రాజు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యూ జిమ్ యజమాని మూనుకుంట్ల సాయికుమార్ గౌడ్, గుండెబోయిన మధు యాదవులను అభినందించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ దినదిన అభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో పట్టణంలోని యువకులుచెడు వ్యసనాలను అలవాటు కాకుండా ఆరోగ్యంగా ఉండటానికి ఈ జిమ్ము ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలోవైస్ చైర్మన్ శ్రీశైలం గౌడ్ కౌన్సిలర్ ఎండి భాషా లింగస్వామి బండమీది మల్లేష్ శ్రీధర్ బాబు గోపగోని లక్ష్మణ్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# నిర్మాణ పనులకు శంకుస్థాపన

**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని 1,9, 16, 19 వార్డులలో సీసీ రోడ్లు మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసినమున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భర్తల శ్రీశైలం గౌడ్, కౌన్సిలర్ ఎండి బాబా షరీఫ్, గోరగోని లింగస్వామి, బండమీది మల్లేష్, దండ హిమబిందు, అరుణ్ కుమార్, పోలోజి శ్రీధర్ బాబు, గోపగోని లక్ష్మణ్, బొడిగ బాలకృష్ణ, తాండూరు పరమేష్,సందగల సతీష్, నాయకులు ఎక్స్ ఎంపీపీ చిక్కం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**పాలకీడు, విశాలభారతి:** మహంకాళి గూడెం గ్రామంలో రూ 10 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఎంపీపీ భూక్యా గోపాల్ నాయక్ గారు,మరియు జడ్పీటిసి మలోత్ బుజ్జి మోతీలాల్ గారు,మండల పార్టీ అధ్యక్షులు యన్. వి సుబ్బారావు గార్ల సహకారంతో ఎంపీటిసి రమవత్ కవిత నీమా నాయక్ గారు , మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.వి.సుబ్బారావు గారు ,మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నీమా నాయక్ గారు తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ్ కుమార్ రెడ్డిగారు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మండలంలో గ్రామా అభివృద్ధి ఎన్ఆర్ఈజీఎస్ నుండి రూ 10 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు..ప్రజల పక్షాన మంత్రి ఉత్తమ్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపినారు.ఇట్టి కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పిడమర్తి దవిడ్, మండల నాయకులు



సైదా రావు, పిడమర్తి ప్రేమ కుమార్, విజయ్ గ్రామ నాయకులు నారాయణ, వేణు, మురళి,దుర్గ ,కృష్ణ, గోవిందా చారీ, నాగేశ్వరావు, సూరి బాబు,లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# బహుమతుల అందజేత

తుంబూరు దయాకర్ రెడ్డి

**పాలేరు, విశాలభారతి:** రూరల్ మండలం స్థానిక కరుణగిరి సమీపంలోని మైదానంలో రెండు వారాలుగా కొనసాగిన పాలేరు నియోజకవర్గ స్థాయి పీ ఎస్ ఆర్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగియగా.. విజేతలకు బహుమతులను రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంప్ కార్యాలయం ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ప్రదానం చేశారు. హోరాహోరీ గా సాగిన ఫైనల్ మ్యాచ్ లో పెద్ద తండా జట్టు ఈ టోర్నీ విజేతగా నిలిచింది. ద్వితీయ బహుమతిని పీ ఎస్ ఆర్ కరుణగిరి జట్టు దక్కించుకుంది. ఇక మూడో స్థానంలో సాయి నగర్ వికలాంగుల కాలనీ నిలవగా..ఈ జట్ల క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు ట్రోఫీ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ సాధించిన వారికి కూడా శీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పోటీల ద్వారా మంచి స్నేహ భావం ఏర్పడుతుందని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కాస్త సమయం క్రీడలకు వెచ్చిస్తే మానసిక ఉల్లాసం తో పాటు క్రీడా స్ఫూర్తి అలవడుతుందని అన్నారు. పీ ఎస్ ఆర్ క్రికెట్ టోర్నీకి మంచి స్పందన వచ్చిందని, ఎక్కువ సంఖ్యలో జట్లు తరలిరావడం హర్షణీయం అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి సునీల్ రెడ్డి, పాలేరు నియోజకవర్గం నాయకులు చావా శివరామకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు భుజంగ రెడ్డి, బానోతు హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

**ఎస్ ఎఫ్ ఐ న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వెన్షన్ లో వక్తలు పిలుపు.**

**హైదరాబాద్,విశాలభారతి,:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర న్యాయ విద్యార్థుల కన్వెన్షన్ గోల్కొండ క్రాస్ రోడ్స్ లోని సిఐటియు కార్యాలయం లో నిర్వహించారు.ప్రారంభంకు ముందు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఐలు రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ ప్రారంభోపన్యాసం చేస్తూ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల విభజన తర్వాత కోర్టులలో కేసులు అనేకం పెండింగ్ లో ఉన్నాయని వాటిని పరిష్కారం చేయడానికి కిందిస్థాయి కోర్టులను ఏర్పాటు చేయాలనీ అన్నారు. నేడు దేశంలో అణగారిన వర్గాల నుండి విద్యార్థులు న్యాయవిద్య వైపు వస్తున్న వారికి సరైన ప్రోత్సాహం లేక మధ్యలోనే ప్రాక్టీసు నిలుపుదల చేస్తూన్నారని అలాంటి వారికి ప్రభుత్వము ప్రోత్సాహం




**తెలంగాణ రాష్ట్రంలో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ ఎల్ మూర్తి టి. నాగరాజు**
కేరళ, కర్ణాటక తరహాలో రాష్ట్రం లో ప్రభుత్వ అధీనంలో నీ న్యాయ విద్యను అందించడానికి ప్రత్యేక న్యాయ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలనీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ ఎల్ మూర్తి టి. నాగరాజులు అన్నారు. న్యాయ విశ్వ విద్యాలయం నుండే పరీక్షల నిర్వహణ హాస్టల్ సీట్లు ప్రవేశాలు కల్పన ఫీజుల నిర్ణయం లాంటి చర్యలు తీసుకోవాలని న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్నారు

కల్పించాలని పేర్కొన్నారు. అలాగే న్యాయ విద్యలోని ప్రస్తుతం సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కరిక్యులమ్ ను తయారు చేసి చదువులో ప్రవేశ పెట్టాలని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో న్యాయ విద్యను అందించే విద్యార్థులకు ప్రభుత్వము కూడా ఆర్థిక సహకారాన్ని అందించి మరింత మంది ఈ రంగంలో ఉండేలా అందరికీ నాణ్యమైన న్యాయ సేవలు అందెలగా చూడాలని కోరారు.నేడు దేశంలో 50 మిలియన్లు కేసులు పెండింగ్ లో ఉన్నాయనీ, పెండింగ్ కేసులు పరిష్కారానికి సరిపడా న్యాయ వాదులు, న్యాయ స్థానాలు రాష్ట్రం లో, దేశంలో లేవని ఈ కేసులు త్వరిత గతిన పరిష్కారం చేయడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

**నూతన కన్వినింగ్ కమిటీ ఎన్నిక:**
ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ న్యాయ విద్యార్థుల కన్వీనింగ్ కమిటీ ఎన్నుకున్నారు. కన్వీనర్ గా విగ్నేష్ కో కన్వీనింగ్ గా డి.ప్రశాంత్, శ్రీకాంత్, ఎం. స్టాలిన్ రమ్య చౌహన్, స్టాలిన్ లు ఎన్నికయ్యారు. 25 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. 11 తీర్మానాలు ఆమోదించారు.



# సర్వే నెంబర్ 101 లో అక్రమ లే ఔట్.

**విశాల భారతి,కీసర :** చీర్యాల్ గ్రామంలోని సర్వే నెంబర్ 101 లో అక్రమ లే ఔట్ చేస్తున్నా బడ బాబులు.వివరాల్లోకి వెళ్తే చీర్యాల్ గ్రామంలో సర్వే నెంబరు 100,101 లో 3600 వ్యవసాయ భూమి ఉండేది.1984 మొత్తం 3600 భూమిలో అప్పటి పట్టా దారులు రఘురాం సురేష్ లు కలిసి లే ఔట్ చేసి ప్లాట్లు అమ్మరు.అప్పట్టి ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు మంజూరు చేయడం జరిగింది.చిర్యల్ గ్రామంలో సర్వే నెంబరు 101 మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలపడం జరిగింది. సర్వే నెంబరు 101 లో 1601 భూమి ఉండగా ఇట్టి భూమిలో ఔట్ చేసి ఉంది అని విషయం తెలుసుకున్న అధికారులు.అట్టి ప్లాట్ల యజమానులకు అనగా సుమారు సగం 825 భూమిలో ఎన్ని ప్లాట్లు ఉన్నాయో అంత మంది ప్లాట్ల యజమానులకు నష్ట పరిహారం ఇవ్వడం జరిగింది.1984 లో మొత్తం 1601 ఎకరాల భూమిలో లే ఔట్ అయితే అదే భూమిలో కొత్తగా రెండు ఎకరాల భూమి ఎలా మిగిలింది.అదే భూమిలో మళ్ళీ రెండు ఎకరాల భూమిలో కొత్త లే ఔట్ ఎలా చేస్తున్నారు అని చిర్యల్ గ్రామంలో చర్చ జరుగుతుంది.తెలంగాణ రాష్ట్రం వచ్చాక తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయితీ లో పంచాయితీ లే ఔట్ చేయొద్దు అని కొత్త చట్టం



తిసుకొంచింది.అయిన కొన్ని గ్రామ పంచాయితీ ల్లో అక్రమ పంచాయితీ లే ఔట్లు ఎలా చేస్తున్నారు అని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.చిర్యల్ గ్రామ పంచాయితీ కార్యదర్శి నారాయణ గౌడ్ ని వివరణ కోరగా గత పది రోజుల క్రితం గ్రామంలో అక్రమ పంచాయితీ లే ఔట్ జరుగుతుంది అని మా దృష్టికి వచ్చింది.వచ్చిన వెంటనే అట్టి లే ఔట్ ను సంధర్శించి వెంటనే నోటీసులు కూడా ఇవడం జరిగిందన్నారు. కలిసి స్థలంలో ప్లాట్ల రాళ్ళు కూడా పంచాయితీ సిబ్బందితో తొలగించడం జరిగింది అని అన్నారు. ఇట్టి విషయం మ పై అధికారుల దృష్టికి కూడా ఈ విషయం తీసుకెళ్లడం జరిగింది అని తెలిపారు.కానీ మకు సెలవు దినాలు ఉన్నది చూసుకొని అట్టి లే ఔట్ లో వర్క్ చేస్తున్నారు అని తెలిసింది.గ్రామంలో ఎలాంటి అక్రమ పంచాయితీ లే ఔట్లు చేసిన ఉపేక్షించేది లేదని అన్నారు.



# బిజెపి మండల అధ్యక్షుడిని సన్మానం

**దేవరుప్పుల, విశాలభారతి:** బిజెపి మండల అధ్యక్షుడిగా కాసాని సత్తయ్య ఎన్నికైన సందర్భంగా ఈ రోజు మండలకేంద్రంలోని భార్గవి గార్డెన్ లో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన జనగామ జిల్లా బిజెపి నాయకులు. కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ గౌడ్,జిల్లా బిజెపి అధికార ప్రతినిధి చింత సృజన్ కుమార్, మాజీ మండల అధ్యక్షుడు భాగాల నవీన్ రెడ్డి, నాయకులు చారి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిజానికి నిలువుటద్దం శ్రీనివాస్ రెడ్డి

- ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి నియామకం
- టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వీట్ల పంపిణీ

**సూర్యాపేట, విశాలభారతి:** నికార్సాయైన జర్నలిజానికి నిలువుటద్దం ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అని టీయు డబ్ల్యూ జె, ఐజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు కృష్ణ అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డి నియామకం పట్ల హర్ష వ్యక్తం చేస్తూ ఆదివారం కొత్త బస్టాండ్ వద్ద టి యు డబ్ల్యూ జె ఐజేయు జిల్లా శాఖ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టుగా జర్నలిజానికి వన్నె తేవడంలో ఆయన కృషి ఎనలేనిదని అన్నారు. త్వరలో జర్నలిస్టుల సంక్షేమం కొరకు తీపి కబురు అందుతుందని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. త్వరలో జర్నలిస్టుల సమస్యలైన ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్, సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎలక్ట్రాన్ మీడియా జిల్లా అధ్యక్షుడు బత్తుల మల్లికార్జున్, జర్నలిస్ట్ లు రాగిరి మల్లేష్, పులుసు నాగరాజు, దేవర శెట్టి వేణు, కొండా శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఉయ్యాల నరసయ్య, పాషా, నకిరేకంటి సైదులు, జహీర్, రామ చంద్ర రాజు, రమేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు



# స్వాములకు అన్నదానం

**చౌటుప్పల్, విశాలభారతి:** మున్సిపాలిటీ పరిధిలోని వలిగొండ రోడ్ లో నూతన శివాలయంలో శివ స్వాములకు ఏనుగుల లింగస్వామి కృష్ణవేణి దంపతులు వారి పెళ్లి రోజు సందర్భంగా శివదీక్ష స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. వారు మాట్లాడుతూ సావులకు అన్నదానం చేయటం మాకు మా కుటుంబ సభ్యులకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

# మాఫియాని ప్రశ్నిస్తే దాడులా

**భద్రాచలం, విశాలభారతి:** పట్టణంలో అంతర్గతంగా అనేక రూపాల్లో మాఫియా కనుసందంలో భద్రాచలంనీ గుప్పెట్లో పెట్టుకున్నారని మహాజన సమితి ఆదివాసి మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహుజన బిడ్డలు న్యాయం కోసం మాఫియాని ప్రశ్నిస్తే వారి నీ నేరుగా ఎదుర్కోలేక పరోక్షదాడులకు పూనుకుంటున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని చట్టాలు ఉన్నా మాఫియా ముఠాలకు అవి చుట్టాలుగా మారుతున్నాయని చట్టాల ఇంప్లిమెంట్ కోసం ప్రశ్నించిన వారిపైన ఏదో ఒక రూపంలో వారి గొంతుని అణచివేసే ధోరణి భద్రాచలం పట్నంలో కనిపిస్తుందని ఆమె ఆవేదన చెందారు. అవినీతి లంచగొండితనం అక్రమ దోపిడిదారులు భద్రాచలంలో పెట్రేగి పోతున్నారని వారి వెనకపెద్ద శక్తులు పనిచేయటం వలన వారి ఆగడాలకు హద్దు అదుపు లేకుండా పోతుందని ఆమె పేర్కొన్నారు. కళ్ళముందే అక్రమాలు అవినీతి జరు



గుతుంటే కొంతమందిమీడియా మిత్రులు వాటిని బహిర్గతం చేసి ప్రజలకు ప్రభుత్వానికి చేరవేసి వారి తప్పుల ధోరణిని ఎండగడతా ఉంటే వారి పైన పగబట్టి ఏదో ఒక రూపంలో అణచివేసే పద్ధతి కనిపిస్తుందని. భద్రాచలంలో చట్టాలు ఉల్లంఘనకు గురి అవుతున్నాయని. అనేక అక్రమాల అవినీతి కి భద్రాచలం అడ్డాగా మారుతుందని ఆమె అన్నారు.



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ ఆదివారం హైదరాబాద్ లోని వారి నివాసంలో కొడంగల్ మాజీ ఎంపిటిసి నంధారం రాజేందర్ కలిశారు. ఆ సందర్భంగా నందరాం రాజేందర్ ఆరోగ్యం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాకబు చేశారు.

# చత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టుల మృతి
- ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం
- రాత్రి వరకు కొనసాగిన కూంబింగ్

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. మావోయిస్టులు భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు హతమయ్యారు. కాంకేర్‌జిల్లాలోని కోయలిబెడ పీఎస్ పరిధి హుర్తరాయ్ గ్రామానికి సమీపంలోని గుట్టపై ఎదురుకాల్పులు జరిగాయని అధికారులు తెలిపారు. భద్రతా సిబ్బంది, పోలీసుల ఉమ్మడి బృందం మావోయిస్టుల జాయింట్ ఆపరేషన్ లో పాల్గొన్నదని కంకేర్‌ఎస్పీ ఇందిరా కల్యాణ్ ఎలెసెలా తెలిపారు. భోమ్రా, హుర్తరాయి, మిచ్చెబెడ గ్రామాల్లో ఐదుగురు మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందిందని తెలిపారు. దీంతో కంకేర్ జిల్లా రిజర్వ్ గార్డ్, బార్డర్‌భద్రతా దళం 30వ బెటాలియన్ జాయింట్ స్క్వాడ్ ను ఆ ప్రాంతానికి పంపినట్లు తెలిపారు. అక్కడ కొద్దిసేపు ఎదురుకాల్పులు జరగ



డంతో మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు. ఘటనాస్థలిలో ముగ్గురు నక్సలైట్ల డెడ్ బాడీలు, కొన్ని ఆయుధాలను అధికారుల స్వాధీనం చేసుకున్నారు. మావోలకు సంబంధించిన సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు. హతమైన మావోయిస్టులు ఎవరని ఇంకా గుర్తించలేదని అధికారులు తెలిపారు.



## బీజేపీ వల్ల ఉమ్మడి జిల్లాకు ఒరిగింది ఏమీ లేదు

- కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేస్తే సహించం
- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి

**కల్వకుర్తి, విశాల భారతి**కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ వల్ల ఉమ్మడి పాలమూరుకు ఒక్క కొత్త ప్రాజెక్టు వచ్చిన పాపాన పోలేదని, కేంద్రంలో 10 సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం ఉన్నప్పటికీ జిల్లాలో వేలాది మంది ఉన్నత చదువులు చదివి కూలీలుగా మారుతు.. నిరుద్యోగ యువత ఇతర ప్రాంతాలకు వలస కూలీలుగా వెళ్లారే తప్ప వారి సంక్షేమానికి కృషిచేసిన దాఖలాలు లేవని జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించి బిజెపి నాయకులు వారి పదవుల కోసం జాతీయ నాయకుల వద్ద మన్ననలు పొందుతున్న అనే తప్ప పాలమూరు జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలలో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి సొంత జిల్లాలో కాంగ్రెస్ రెండు ఎంపీ సీట్లు గెలిచి బీజేపీ, బిఆరెస్ కు డిపాజిట్లు గల్లంతక్క కావడం ఖాయమని ఎద్దేవ చేశారు. ఈ సమావేశంలో నాయకులు చిమ్మల శ్రీకాంత్ రెడ్డి, మిరియాల శ్రీనివాస్ రెడ్డి, పుస్తకాల రాహుల్, శ్రీధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బీస బాలరాజు, జంగయ్య గౌడ్, బండి సుదర్శన్, భరత్, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



## సీఐ, ఎస్సై లను సన్మానించిన లయన్స్ క్లబ్

**కల్వకుర్తి, విశాల భారతి:**కల్వకుర్తి పోలీస్ స్టేషన్ లో నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన సిఐ నాగార్జున, ఎస్సై మాధవరెడ్డి లను ఆదివారం కల్వకుర్తి లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు లయన్ కల్మిచర్ల రమేష్ నేతృత్వంలో శాలువాతో సత్కరించి సిఐ, ఎస్ఐలకు పూల బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా లైయన్స్ క్లబ్ చేసే సేవా కార్యక్రమాలను సీఐ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చిగుళ్ళపల్లి శ్రీధర్, కోశాధికారి గోవిందు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మిరియాల శ్రీనివాస్ రెడ్డి, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ గుబ్బా కిషన్, తర్నికల్ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి అప్పాయిపల్లి శ్రీనివాస్, దుగ్గి వెంకటేష్, జూలూరు సత్యం, సురేందర్ రెడ్డి, పూరి రమేష్, రవి గౌడ్, దారమోని గణేష్ తదితరులు ఉన్నారు.



## ప్రయాణికులతో ఎమ్మెల్యే మాటా మంతి

**కల్వకుర్తి, విశాల భారతి:**ఆమనగల్లు ఆర్టిసి బస్టాండ్ ఆవరణలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలలో ఒకటైన మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణం అమలవుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. సోమవారం బస్టాండ్ ఆవరణలో ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అక్కడే ఉన్న మహిళా ప్రయాణికులతో మాటామంతి కలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం ఎలా సాగుతుందని మహిళలతో అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నలకు మహిళలు సమాధానం ఇస్తూ ఉచిత బస్సు ప్రయాణం చాలా బాగుంది సార్.. అంటూ నవ్వుతూ బదులిచ్చారు. ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా.. అని వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రయాణ సమయంలో ఆధార్ ఇతరత్రా గుర్తింపు కార్డులు చూపిస్తే ఉచిత ప్రయాణం సాఫీగా కొనసాగుతుందని మహిళలకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.



## దేవాలయ సేవాపరులకు సన్మానం

ఎంపిటిసి గూడూరు శ్రీనివాస్ రెడ్డి

**కల్వకుర్తి, విశాల భారతి:**కడ్తాల్ మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయ సేవాకమిటి సభ్యులను ఆదివారం కడ్తాల్ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్ రెడ్డి శాలువాలతో సత్కరించి వారికి వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయ సేవాపరులు గత కొన్ని సంవత్సరాలుగా శ్రీ చెన్నకేశవ స్వామికి, దేవాలయానికి చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. దేవాలయ సేవాకమిటి సభ్యులు చేస్తున్న సేవలకు స్వామివారి ఆశీస్సులు వారికి, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ప్రజలందరినీ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉంచాలని స్వామి వారిని వేడుకున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ వేణు పంతులు, ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సింగిల్ విండో డైరెక్టర్ తదితరులు ఉన్నారు.

## ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ గా శ్రీనివాస్ రెడ్డి

హర్షం వ్యక్తం చేసిన ఎల్లయ్య.

**మేడిపల్లి,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ గా కే.శ్రీనివాస్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించడం పట్ల మేడిపల్లి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కల్వాకరి ఎల్లయ్య హర్షం వ్యక్తం చేశారు. సుమారు 5 దశాబ్ధాలుగా జర్నలిస్టు వృత్తిలో నీతి నిజాయితీలకు కట్టుబడి జర్నలిస్టుల సంక్షేమం కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్నారని తెలిపారు. ఈ పదవి అనేది ఆయనకున్న సుదీర్ఘ అనుభవానికి దక్కిన గౌరవంగా భావించాలని అన్నారు. గత పదేళ్లుగా అన్యాయానికి గురవుతున్న జర్నలిస్టులకు



శ్రీనివాస్ రెడ్డి హయాంలో తప్పకుండా న్యాయం జరుగుతుందని కల్వాకరి ఆశాభావం వ్యక్తం చేశారు.





## ఉత్తమ విద్యకు చిరునామా ది మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థలు

- ది మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల చైర్మన్ రాజు సంఘాని
- ఘనంగా ది మాస్టర్ మైండ్స్ స్కూల్ వార్షికోత్సవం

**పటాన్ చెరు,విశాలభారతి:**
విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఇంటిగ్రేట్ సిస్టంతో రేపటి ఉత్తమ భావి భారత పౌరులుగా ది మాస్టర్ మైండ్స్ విద్య సంస్థలు తీర్చిదిద్దుతు ఉత్తమ విద్యకు చిరునామగా నిలుస్తున్నాయని ది మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల చైర్మన్ రాజు సంఘాని తెలిపారు. పటాన్ చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో శనివారం సాయంత్రం ది మాస్టర్ మైండ్స్ స్కూల్ లో డైరెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా ఆనివల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చైర్మన్ రాజు సంఘాని మాట్లాడుతూ... విద్యార్థులకు ఎప్పటికప్పుడు నాణ్యమైన విద్యను అందిస్తూ 50 బ్రాంచీలకు పైగా ది మాస్టర్ మైండ్స్ స్కూల్స్ నడుపుతున్నట్లు పేర్కొన్నారు. క్వాలిటీ ఎడ్యుకేషన్, ఇంటిగ్రేట్ సిస్టంతో సీబీఎస్సీ, ఐసిఎస్సి, ఐజిసిఎస్సి కోర్సులను కొనసాగించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులకు చదువులో మెలుకువలు నేర్పుతూ వారికి చేయూత నిస్తున్నట్లు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ చక్కటి విద్యను అందిస్తున్నామన్నారు. రోజువారీగా విద్యార్థులకు చదువుపై దృష్టి మళ్లించే విధంగా అవేర్నెస్ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. చదువుతోపాటు లైఫ్ స్కిల్స్, గ్రామర్ తో ఇంగ్లీష్ లో సీఎల్డీపి ప్రోగ్రాం చేపడతామని చెప్పారు. 6 నుండి 10 వరకు విద్యార్థులకు ఐఐటి, మెడికల్ ఎంట్రన్స్ పైన ఫోకస్ పెట్టడం జరుగుతుందన్నారు. సెంట్రల్ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు పలు సూచనలు అందజేయడం జరుగుతుందని అన్నారు. అలాగే డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. పటాన్ చెరు పారిశ్రామికవాడ ప్రాంతంలో సామాన్య, మధ్యతరగతి వారే ఉంటారని వారిని దృష్టిలో ఉంచుకొని మెరుగైన విద్యను అందించటంతో పాటు విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసే విధంగా ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఆనివల్ డే కార్యక్రమం సందర్భంగా కలర్ ఫుల్ లైటింగ్ లో విద్యార్థిని విద్యార్థులు చేసిన డ్యాన్సులు, సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతగానో ఆలరించాయి. ఈ కార్యక్రమంలో ఇంద్రేశం మాజీ సర్పంచ్ నర్సింలు, రామేశ్వరంబండ మాజీ సర్పంచ్ అంతిరెడ్డి గారి ధరణి అంతిరెడ్డి, మాజీ ఎంపిటిసి అంతిరెడ్డి గారి అంతిరెడ్డి, స్కూల్ డైరెక్టర్లు నాగరాజు, శివ నాయక్, రామకృష్ణ, ప్రిన్సిపల్ దీప ప్రవీణ్, టీచర్లు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## గాంధారి ఖిల్లాను టూరిజం స్పాట్ ఏర్పాటుకు కృషి చేస్తా

ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

**మంచిర్యాల, విశాల భారతి:**మందమర్రి మండలం బొక్కల గుట్ట గాంధారి ఖిల్లా మైసమ్మ జాతరలో పాల్గొన్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి.. కాలభైరవుడినీ దర్శించుకొని ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. అనంతరం జీడికోటలో ఏర్పాటు చేసిన దర్బార్ లో పాల్గొని ఆయన మాట్లాడుతూ.. గాంధారి ఖిల్లాను టూరిజం స్పాట్ గా ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి టూరిజం స్పాట్ ఏర్పాటు కి కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పక ప్రజలకు చేరేవిదంగా ప్ర



ణాళిక బద్దంగా ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు,ఆదివాసీ నాయక్ పోడ్ కుల పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## హోలిస్టిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

హాజరైన ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని కమలప్రసన్న నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ను కార్పొరేటర్ మాధవరం రోజాదేవితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెక పూడి గాంధీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ హోలిస్టిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ లో కాలనీ వాసులకు,పరిసర ప్రాంత పేద ప్రజలకు ఉచిత పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలు అందించడం గొప్ప విషయం అన్నారు.ఉచితంగా రక్త పరీక్షలు,జనరల్,దంత వైద్యం, బీపీ,షుగర్,గైనకలజీ,ఆర్థో, ఈసీజీ,ఈఎన్టి,వంటి సేవలు ఒకే చోట ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారన్నారు. పేద ప్రజలు ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాలన్నారు. ఆరోగ్యం వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో సామాజిక దృక్పథంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావు, వివేకానంద నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు,నాయి నేని చంద్రకాంత్ రావు,కమల ప్రసన్న నగర్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ , వైస్ ప్రెసిడెంట్ తిరుపతి,ట్రెజరర్ శంకర్,జనరల్ సెక్రటరీ బండప్ప,ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేష్,డాక్టర్ శ్వేతా, చంద్రశేఖర్,వైద్య సిబ్బంది , కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దారుపల్లి అనిల్ జన్మదిన వేడుకలు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**హైదర్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ యువ నేత దారుపల్లి అనీల్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన బర్త్డే వేడుకల్లో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై యువనేత అనిల్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి అందరికి పంచిపెట్టారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీకి యువ నాయకులే పట్టుకొమ్మలని, వారని పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. అనిల్



భవిష్యత్తులో మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.



## అట్టహాసంగా అట్టుకల్ పొంగల్ పండుగ

**విశాలభారతి,కూకట్పల్లి :**కూకట్పల్లి లోని దేవీనగర్ (కేరళ కాలనీ) లో నివాసముంటున్న మలయాలిలు ప్రతి సంవత్సరం ఇదే మాసాన అట్టుకల్ పొంగల్ పండుగను మహిళలు సాంప్రదాయభద్ధంగా నిర్వహించారు. అరటిపండ్లతో బెల్లం, అన్నం, నెయ్యి లతో ప్రసాదం తయారు చేసి, అన్నప్రాసదాలను అందరికి పంచారు. కూకట్పల్లి పోచమ్మ తల్లి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ గొట్టిముక్కల వెంకటేశ్వర రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీనగర్ వాసులకు, కేరళ ప్రజలందరికి అట్టుకల్ పొంగల్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేరళ కాలనీ అధ్యక్షులు ఎం కె బాబు, నవోద్య, విజయ్ కుమార్, మంగళన్, అప్పచెన్, మేఘ, రమేష్, కాంగ్రెస్ నాయకులు, మేకల సుదర్శన్,మేకల రమేష్, యుగంధర్, నరేందర్ చున్ను పాషా, నయీమ్ మొహమ్మద్, కావేటి నాగార్జున, కృష్ణవేణి పాల్గొన్నారు.



## మాదిగలకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలి.

మాదిగ హక్కుల దండోరా
రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ మాదిగ

**సికింద్రాబాద్, విశాలభారతి:** తెలంగాణ మంత్రివర్గంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఓయూ లో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాదిగ మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన దాదాపు 10 సంవత్సరాల నుండి గత ప్రభుత్వ పాలకులు మాదిగలకు రాజకీయంగా మరియు ప్రభుత్వంలోతగిన ప్రాధాన్యత కల్పించలేదన్నారు. కొత్తగా ఏర్పాడిన ప్రభుత్వం మంత్రివర్గం లో రాజకీయంగా మాదిగలకు సముచిత స్థానాన్ని కల్పించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్, నాగర్ కర్నూల్, పెద్దిపల్లి పార్లమెంట్ టికెట్ ను లోకసభ ఎన్నికలలో మాదిగలకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీని కోరారు. అదే విధంగా రాష్ట్రంలోని మాదిగల ప్రజల సమసలపై మరియు రాష్ట్రంలోని సమస్యలపై పార్లమెంట్లో మాట్లాడే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్స్ చిలుక రాజనర్సింహ, శ్యామ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాదిగ, అధికార ప్రతినిధి ప్రకాష్, శీను, శాంతి, ప్రసాద్ పాల్గొన్నారు.



## లాస్య కుటుంబంను పరామర్శించిన మాజీ మంత్రి కేటీఆర్

**విశాలభారతి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ :**రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లాస్య కుటుంబాన్ని మాజీ మంత్రి టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. లాస్య చిత్రపటానికి నివాళులు అర్పించిన ఆయన, రాజకీయాల్లో ఎదుగుతున్న సందర్భంలో ఇలాంటి విషాద సంఘటన చోటు చేసుకోవడం తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. పార్టీపరంగా వారి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తండ్రిని కోల్పోయిన లాస్య, మొక్కవోని ధైర్యంతో తండ్రి రాజకీయ వారసత్వాన్ని పునికి పంచుకొని కంటోన్మెంటు ఎమ్మెల్యేగా ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆశించారు,కానీ దేవుడు లాస్య కలలను చిదిమి వేసి



కానరాని లోకానికి తీసుకువెళ్లాడని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడు వారి కుటుంబాన్ని ఆదరించి ఓదార్చాలని కేటీఆర్ ప్రార్థించారు. కేటీఆర్ తో పాటు పార్టీ నేతలు స్థానికులు ఇతరులు పాల్గొన్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily




## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- మెడివిజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**సూర్యాపేట, విశాలభారతి:** ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను జర్నలిస్టులు సద్వినియోగం చేసుకొని అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దండ శ్యామ్సుందర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పెన్షనర్స్ భవనంలో ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులకు హైదరాబాదుకు చెందిన మెడివిజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగులు జర్నలిస్టులు తమ హెల్త్ కార్డు ద్వారా ఎంత పెద్ద రోగమైన పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం పొందవచ్చు అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో అందించే నాణ్యమైన వైద్యం పొందాలంటే ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మెడివిజన్ ఆసుపత్రి వైద్యులు రెహానా, సంతోష్, వాసు, ఆర్గనైజర్ ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



## మళ్లీ మోడీనీ పీఎం చేద్దాం

**విజయ సంకల్ప సభలో చతిస్గడ్ ముఖ్యమంత్రి**

**భద్రాచలం, విశాలభారతి:** మూడవసారి కూడా మోడీని పీఎం చేద్దాం అని చత్తీస్గడ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 2004 నుండి 2014 వరకు కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదని, ఆ కాలం మొత్తం స్కాముల మయం అని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ గిరిజనులకు అత్యున్నత స్థానం కల్పిస్తున్నారని, ద్రౌపది ముర్ము గిరిజన మహిళను రాష్ట్రపతిగా చేసిన ఘనత బీజేపీ దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ధర్మారావు, కాకతీయ సామ్రాజ్య వారసులు కమల్ చంద్ బంజ్ దేవ్, సన్నే ఉదయ్ ప్రతాప్, రంగా కిరణ్, కుంజా ధర్మ తదితరులు పాల్గొన్నారు.



## యూనియన్ అధ్యక్షునిగా చెరుకు వేణు

**సూర్యాపేట, విశాలభారతి:** మున్సిపల్ వాటర్ సప్లై వర్కర్స్, లైటింగ్, బోరింగ్ సెక్షన్ యూనియన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నికల ద్వారా ఎన్నుకున్నారు. ఆ సంఘం అధ్యక్షులుగా చెరుకు వేణు, కార్యదర్శిగా గుండు నాగరాజు లను ఎన్నికల ద్వారా ఎన్నుకోగా కోశాధికారిగా ఫతాని శ్రీనివాస్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు వేణు మాట్లాడుతూ సంఘం సభ్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను యూనియన్ నాయకులు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటీ అధ్యక్షులు సందన బోయిన రాములు, మున్య నాయక్, మాజీ అధ్యక్షులు సమ్మి, సందీప్, సురేందర్ రాజు, భాస్కర్ , సౌమమ్మ, బలరాం, ఉప్పలమ్మ ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## సిఐటియు ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు

**మరిపెడ, విశాలభారతి:** మున్సిపాలిటీ కేంద్రంలోని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులకు 54 రకాల పరీక్షలు చేసి హెల్త్ క్యాంపు ని నిర్వహించారు. ఆదివారం పురపాలక సంఘం కార్యాలయంలో జరిగిన ఈ క్యాంపుకు ఆదర్శ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్య హెల్త్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బిల్డింగ్ రంగం కార్మికులకు 54 రకాల పరీక్షలు చేపట్టారు. హెల్త్ క్యాంపుకు జిల్లా కోఆర్డినేటర్ ప్రేమ్ కుమార్, కోఆర్డినేటర్ ఉపేందర్, డాక్టర్లు ఓరుగంటి రూప, వైద్య సిబ్బంది శిరీష స్వప్న ,బాసు ,మంగీలాల్ మహేష్. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వలస కార్మిక సంఘం నాయకులు బొడ్డు వెంకన్న,మండల సహాయ కార్యదర్శి దేవరశెట్టి కృష్ణ, నాయకులు లింగన్న, బిక్షం, కావుండ్ల వెంకన్న, బెల్లం పాపయ్య, జిన్న నాగయ్య, జినక రామ్మూర్తి, సైదులు తదితరులు ఉన్నారు.

## వర్క్ షాప్ ను జయప్రదం చేయండి

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు**



**సూర్యాపేట, విశాలభారతి:** ఫిబ్రవరి 26 న కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్ లో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా స్థాయి వర్క్ షాప్ ను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు, మండల, గ్రామఅధ్యక్ష, కార్యదర్శులను ఈ సమావేశానికి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ వర్క్ షాప్ కు ముఖ్య అతిథులుగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున రెడ్డి హాజరవుతున్నారని చెప్పారు. కాబట్టి సభ్యులు సకాలంలో హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయగలరని కోరారు.

# ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

- పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు,
- విశ్రాంత అధ్యాపకులు మంత్రి ప్రగడ భరత రావు

**కోదాడ, విశాలభారతి:** తల్లిదండ్రుల జీవనశైలి పిల్లలపై ఎంతో ప్రభావం చూపుతుందని నేటి ఆధునిక సమాజంలో డబ్బు, సంపాదన కోసం అధిక సమయం కేటాయిస్తూ తల్లిదండ్రులు పిల్లలకు తగిన సమయం కేటాయించడం లేదని పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్థి సుబ్బారావు, విశ్రాంత అధ్యాపకులు మంత్రి ప్రగడ భరతారావు లు అన్నారు. శనివారం రాత్రి కోదాడ పట్టణంలోని స్థానిక ఎస్ఆర్ఎం పాఠశాల దశమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడారు. పిల్లలకు దానం ఇస్తే సరిపోదని తల్లిదండ్రులతో గడిపే జ్ఞాపకాలు ఇవ్వాలన్నారు. ముఖ్య అతిథి పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కోదాడ, హుజూర్నగర్ ప్రాంతల్లో విద్యాసంస్థలు నెలకొల్పి గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులకు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## 2600 మందిపై కేసులకు కారకుడు బాల్క సుమన్

- అక్షరాలకు కులాల రంగులు పులిమింది గులాబీ కాదా?
- జర్నలిస్ట్, సామాజిక సేవకుడు చాట్లపల్లి అనిల్



**మందమర్రి టౌన్, విశాల భారతి:** కాంగ్రెస్ ప్రభుత్వంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు అనారోగ్యకరమైన సూచికగా హేయమైన చర్యలుగా పరిగణలోకి తీసుకోవాలని యువ జర్నలిస్ట్, సామాజిక సేవకుడు చాట్లపల్లి అనిల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దశాబ్దం పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం అక్షరాలకు కులాల రంగులు పులిమి విభజిస్తూ పాలించే విభేదాలు సృష్టించి విష బీజాలు వేసిందని గుర్తు చేశారు. గతంలో అధికారంలో ఉన్న నాయకులు నిజాలను నిర్భయంగా రాసే పాత్రికేయులపై నిర్బంధం సృష్టించి అల్లరిమూకల దాడులు జరిపింది దాష్టీకానికి పాల్పడింది పోలీసులతో బెదిరింపులు జరిపించింది నిజం కాదా అని ప్రశ్నించారు. దశాబ్ద కాలంలో తెలంగాణ రాష్ట్రంలో అర్బన్ మావోయిస్టులతో, మాజీ మావోయిస్టులతో బాల్క సుమన్ అంతర్గత ఒప్పందాలు చేసుకున్నట్లు సంక్షేమ పథకాల్లో వారికే పెద్దపీట వేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గులాబీ కార్యకర్తలపై ఇప్పటి వరకు నమోదైన కేసులకు బాల్క సుమన్ మాత్రమే కారకుడని అన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధిగా ప్రజలకు తెలియకుండా రహస్య సమావేశాలు నిర్వహించడం, అధికారిక సమావేశాలకు అక్షరానికి అనుమతి లేకుండా నిషేధిస్తూ అధికారం కోల్పోయిన పిదప అక్షరయోధుల పట్ల మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆవేదన చెందటం పార్టీ లబ్ధి కోసం లేదా వ్యక్తిగత గుర్తింపు తప్ప మరొకటి కాదని ప్రజలు, పాత్రికేయులు గుర్తించాలని అన్నారు.

## దారి తప్పుతున్న బాల్యం

**దురలవాట్లకు గురవుతున్న బాలలు**

**భీమదేవరపల్లి, విశాల భారతి:** నేటి తరహా బాల్యం, మద్యం, ధూమపానం, దురవాట్లకు బానిసలై మంచి బంగారు భవిష్యత్తు ఉన్న జీవితాన్ని తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపంతో నాశనం చేసుకుంటున్నారు. ఈ తరహా బాల్యం వ్యవహారాలు రాను రాను పెరిగిపోతున్నాయి. తల్లిదండ్రులు బయట చెప్పుకోలేక కుమిలిపోతున్న సంఘటనలు ఉన్నత, సాధారణ, మధ్యతరగతి, కుటుంబాలలో ప్రస్తుత కాలంలో వెలుగు చూస్తున్నాయి.

**ఆర్థిక స్వేచ్ఛతో ఇబ్బందులు:**

ఈ తరహా సమస్యలకు అనేక కారణాలు ఉన్నట్లు పలువురు నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా తల్లి దండ్రుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల పిల్లలు దారి తప్పుతున్నట్లున్నారు. 16, 17, సంవత్సరాలకే కొంత మంది పిల్లలు మద్యానికి అలవాటు పడుతున్నారు. చిన్న వయసులో దారి తప్పుతున్నవారిలో తల్లిదండ్రుల పర్యవేక్షణ లేని పిల్లలు అధికంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. చిన్న చిన్న విషయాలకు కూడా గొడవ పడుతున్నారు.

**తల్లిదండ్రులు అప్రమత్తం కావాలి:**

ఉద్యోగ, వ్యాపార రీత్యా తల్లిదండ్రులు బిజీగా మారిపోయారు. పిల్లల కోసం సమయాన్ని కేటాయించలేనిపరిస్థితి నెలకొంది. అదే ఇప్పుడు పిల్లలు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించేందుకు కారణమవుతుంది. అయితే పిల్లల కోసం తల్లిదండ్రులు మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతిరోజు కనీసం గంట సమయమైనా పిల్లలతో కేటాయించాలి. ముఖ్యంగా హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్న పిల్లలతో సమయం ఉన్నపుడల్లా మాట్లాడాలి వీలైనప్పుడల్లా వెళ్లి పలకరించాలని పలువురు, నిపుణులు, మేధావులు చెబుతున్నారు.

## జనరల్ బాడీని జయప్రదం చేయండి

**ఎం చందర్ రావు, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి**



**కోదాడ, విశాలభారతి:** విద్యా రంగంలో వస్తున్న మార్పులపై, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడే విద్యార్థి సంఘం పిడిఎస్యు అని పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చంద్రరావు అన్నారు. నేడు లాల్ బంగ్లాలో జరిగే పిడిఎస్యు జిల్లా జనరల్ బాడీని విజయవంతం చేయడానికి జిల్లాలోని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో కులతత్వాన్ని పెంచి పోషించడం కోసం అనేక కుయుక్తులు పన్నుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ నూతన విద్యా విధానంను తీసుకువచ్చి విద్యార్థుల మెదడులో కులతత్వాన్ని, మూఢనమ్మకాలను పెంచి పోషించాలని చూస్తున్నాడని వారన్నారు. మోడీ ప్రభుత్వం చేస్తున్న అరాచీకరణ విద్యార్థులు ఎండగట్టాలని వారు పిలుపునిచ్చారు. నేడు కోదాడ పట్టణంలో జరిగే పిడిఎస్యు జిల్లా జనరల్ బాడీలో విద్యార్థుల అధిక సంఖ్యలో పాల్గొని భవిష్యత్ కార్యక్రమం చర్చించి కార్యక్రమాలు రూపొందించాలని ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



## కోదాడను అగ్రస్థానంలో నిలపాలి

- వ్యాపారంలో నైతిక విలువలు పాటించాలి
- చైర్ పర్సన్ సామినేని ప్రమీల, డీఎస్పీ శ్రీధర్ రెడ్డి

**కోదాడ, విశాలభారతి:** వర్తక వాణిజ్య రంగంల్లో కోదాడను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్, కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డిలు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని వర్తక సంఘం భవన్ లో కోదాడ వర్తక సంఘం నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్తక వాణిజ్య రంగాల అభివృద్ధితో కోదాడ అభివృద్ధి సాధిస్తుందన్నారు. వర్తక సంఘం ఆర్థిక పురోగతి సాధించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. వ్యాపారంలో నైతిక విలువలు పాటించి పేరుపొందాలన్నారు. ఈ సందర్భంగా వర్తక సంఘానికి అధ్యక్షునిగా ఎన్నికైన మేళ్లచెరువు కిషోర్, ప్రధాన కార్యదర్శిగా కొత్తూరు పూర్ణచంద్రరావు, కోశాధికారిగా కొత్త శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా బండారు వెంకటేశ్వర్లు, చల్లా విజయ్ శేఖర్, కందిబండ శ్రీనివాసరావు, చిన్న బ్రహ్మం, వంగవీటి శేఖర్, సురేందర్ కుమార్, జాయింట్ సెక్రటరీ చీదేళ్ల సురేష్, సత్యనారాయణ, దుర్గారావు ఇరుకుల్ల రాధాకృష్ణ, గాధం శెట్టి సంతోష్, ఉప కోశాధికారిగా మేళ్లచెరువు వెంకన్నలు ప్రమాణ స్వీకారం చేశారు.

## ఎస్సైకి సన్మానం

**దేవరుప్పుల, విశాలభారతి :** మండలం నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన చెన్నకేశవులును సింగరాజుపల్లి గ్రామ కాంగ్రెస్ సభ్యులు కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా సింగరాజుపల్లి గ్రామంలో బెల్టు షాపుల నిషేధం గురించి ఎస్సై కి వివరించారు. మధ్యపానం వలన అనేక కుటుంభాలు రోడ్డున పడ్డాయని మద్యపాన నిషేధం పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో తీసుకున్న బెల్టు షాపుల నిషేధం తీర్మానాన్ని అమలు చేయాలని, అక్రమంగా మద్యం అమ్మే బెల్టు షాపుల నిర్వాహకుల పైన చట్ట పరమయిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎస్సై బెల్టు షాపుల



నిషేధాన్ని అభినందించి మధ్యపాన నియంత్రణకు పూర్తిగా సహకరిస్తానని హామీ ఇచ్చాడు. ఎస్సైని కలిసిన వారిలో గ్రామ అధ్యక్షుడు కొండ పెద్ద మల్లారెడ్డి, కంటెస్టెడ్ సర్పంచ్ నల్ల యాదగిరి, సీనియర్ నాయకులు కొండ చిన్న మల్లారెడ్డి, యూత్ అధ్యక్షులు జోగు సోమరాజు, తదితరులు ఉన్నారు.



## గీతా కార్మికుల ప్రాణాలను కాపాడండి

- ప్రతి గీతా కార్మికునికి బైకులు ఇవ్వాలి
- కేజీకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య

**దేవరుప్పుల విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన 6 గ్యారంటీలతో పాటు ప్రత్యేకంగా గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని దేవరప్పుల మండల కేంద్రంలో ఉన్న అక్షర గార్డెన్ లో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఉప్పునుంతల అయోధ్య అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య, బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మల్లేశం హాజరై కల్లుగీత కార్మిక సంఘం నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బాల్నే వెంకట మల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిమీదనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని,వారి సంక్షేమం కోసం ప్రభుత్వం 5 వేల కోట్ల రూపాయలు బడ్జెట్ కేటాయించాలని, 2003 నాలుగు సంవత్సరంలో టి డి పి ప్రభుత్వం కోటి వరాల కింద సొసైటీలకు ఇచ్చిన భూములకు ఫెన్సింగ్ చేసి ఆ భూమిలో తాటి ఈత జిలుగు,ఖర్జూర తదితర కల్లు నిచ్చే పొట్టి చెట్లను నాటి కల్లుగీత వృత్తిని కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో కేజీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు పరిధిల భాస్కర్,సోషల్ మీడియా కన్వీనర్ మిట్ట భిక్షపతి, టిసిఎస్ అధ్యక్షుడు గుర్రం రామచంద్రయ్య, వి.సోమయ్య, అశోక్, దాసగొని తుకారాం, ఉప్పునుంతల సత్తయ్య, యు .నాగరాజు, కోతి నరేందర్, కన్నా రామ్మూర్తి, కన్నా యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




## ప్రతిభ పురస్కారం అందజేత

**శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ విద్యార్థి**

**దేవరుప్పుల, విశాలభారతి:** హైద్రాబాద్ లోని కూకట్ పల్లిలో జరిగిన స్టేట్ లెవెల్ అబాకస్&వేదిక్ మ్యాథ్స్ టాలెంట్ లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జనగామ జిల్లా,దేవరుప్పుల మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థి యామ.శివ ఆంజనేయులు(3 వ తరగతి)కి ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా ప్రతిభ పురస్కారాన్ని అందుకున్న విద్యార్థి శివను శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ కరస్పాండెంట్ తోటకూరి పాండుకృష్ణ, పాఠశాల యాజమాన్యం అభినందించారు.



## మృతుని కుటుంబానికి పరామర్శ

**మాజీ మంత్రి ఎర్రబెల్లి**

**దేవరుప్పుల విశాలభారతి:** కోలుకొండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు వల్లెపు కుమార్ తండ్రి వల్లెపు కొమురయ్య గత కొద్ది రోజుల క్రితం మరణించగా ఈ రోజు వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.వారి వెంట బి ఆర్ ఎస్ నాయకులు ,కార్యకర్తలు,తదితరులున్నారు.



# నేచురల్ స్టార్ నాని #Nani32 అనౌన్స్ మెంట్

వరుస హిట్లతో దూసుకెళ్తున్న నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రూపొందుతున్న 'సరిపోదా శనివారం' చిత్రంలో నటిస్తున్నారు. నాని బర్త్‌డే స్పెషల్‌గా టీజర్‌ను విడుదల చేసిన ప్రొడక్షన్ హౌస్ మరో ప్లెజెంట్ సర్ప్రైజ్ ఇచ్చింది. నాని పుట్టినరోజున డబుల్ ట్రీట్ ను అందిస్తూ బ్యానర్‌లో #Nani32ని ప్రకటించారు. డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి సంయుక్తంగా నిర్మించనున్న కొత్త చిత్రానికి దర్శకుడు సుజీత్ దర్శకత్వం వహించనున్నారు. ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో 'ఓజి' సినిమా చేస్తున్న సుజీత్ తన తదుపరి సినిమా కోసం నానితో జతకట్టనున్నారు. 'సరిపోదా శనివారం' షూటింగ్ పూర్తయిన తర్వాత ఇది ఫ్లోర్స్ పైకి వెళ్లనుంది. "ఇది సుజీత్ సినిమా. పవర్ తర్వాత... లవర్ వస్తాడు #Nani32" అని ట్వీట్ చేశారు నాని. అద్భుతమైన యాక్షన్ రైడ్‌గా రూపొందించబడిన ఈ చిత్రం కాన్సెప్ట్ వీడియో ద్వారా అనౌన్స్ చేశారు. ఒక హింసాత్మక వ్యక్తి అహింసాత్మకంగా మారినప్పుడు, అతని ప్రపంచం తలక్రిందులుగా మారుతుంది. ఇది సినిమా బేసిక్ లైన్ స్టోరీ. ఇది యూనిక్, ఇంట్రస్టింగ్ గా వుంది. #Nani32, 2025లో విడుదల అవుతుంది. ప్రాజెక్ట్ కు సంబధించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.



# రెడ్ అందాల మిల్కీ బ్యూటీ



మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవ్వబోతుంది. అయినా కూడా ఆమె అందం విషయంలో ఇంకా పాతికేళ్ల పడుచు అమ్మాయి అన్నట్లుగానే ఉంది. తాజాగా ఈ ఫోటోలు షేర్ చేయడం ద్వారా తమన్నా మరోసారి తన అందం ఏమాత్రం తగ్గలేదు అంటూ నిరూపించే ప్రయత్నం చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు సినిమాల్లో వరుసగా నటిస్తున్న కారణంగా మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవుతున్నా కూడా అభిమానులు పెద్ద ఎత్తున ఉన్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా తాజాగా రెడ్ డ్రెస్ లో మరోసారి తన అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసింది. ఈ మధ్య కాలంలో మిల్కీ బ్యూటీ కి సినిమాల్లో ఆఫర్లు కాస్త తగ్గాయి. అయినా కూడా వెబ్ సిరీస్ లు, ప్రత్యేక పాటలు, సీనియర్ హీరోలకు జోడీగా నటిస్తూ ఎప్పుడూ బిజీగానే ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు ఆమె వయసు మరింతగా తగ్గించి చూపిస్తున్నాయి అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. గత ఏడాది చిరంజీవి మరియు రజినీకాంత్ సినిమాల్లో నటించిన ఈ అమ్మడు ఈ ఏడాది మరిన్ని సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అంతే కాకుండా వెబ్ సిరీస్ ల్లో కూడా ఈ అమ్మడు నటించే అవకాశాలను దక్కించుకుంటూ ఉంది. తెలుగు లో ఈ అమ్మడు మరో పదేళ్ల పాటు సందడి చేయడం ఖాయం అంటూ ఈ ఫోటోలు చూస్తే అర్థం అవుతోంది.

# గీతాంజలి మళ్ళీ వచ్చింది' పెద్ద హిట్ అవ్వాలి..

అద్భుతమైన అభినయంతో ఆకట్టుకునే అందాల నటి అంజలి టైటిల్ పాత్రలో నటిస్తోన్న హారర్ ఎంటర్‌టైనర్ ‘గీతాంజలి మళ్ళీ వచ్చింది’. 2014లో తక్కువ బడ్జెట్ తో రూపొంది బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన ‘గీతాంజలి’ సినిమాకు ఇది సీక్వెల్. కోన ఫిల్మ్స్ కార్పొరేషన్, ఎం.వి.వి.సినిమాస్ బ్యానర్స్‌పై కోన వెంకట్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శివ తుర్లపాటి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 22న విడుదల కాబోతోంది. ఈ క్రమంలో ఈ మూవీకి సంబంధించిన టీజర్‌ను శనివారం రిలీజ్ చేశారు. ఈ టీజర్ లాంచ్ ఈవెంట్‌కు దర్శకుడు బుచ్చిబాబు, బాబీ, గోపీచంద్ మలినేని, హీరో శ్రీ విష్ణు ముఖ్య అతిథులుగా వచ్చారు. ఈ ఈవెంట్ లో.. హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ.. ‘కోన వెంకట్ గారితో గత ఏడాది నుంచి పని చేస్తున్నాను. త్వరలోనే ఆయనతో ఓ చిత్రాన్ని చేస్తున్నాను. కథ మీద ఎక్కువగా దృష్టి పెడతారు. తొందర పెట్టరు. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేష్ ఇలా అందరూ నాకు కావాల్సిన వాళ్లు. సినిమా టీంకు ఆల్ ది బెస్ట్. దర్శకుడికి మంచి పేరు రావాలి. మార్చి 22న థియేటర్లో అందరినీ నవ్విస్తూ, భయపెట్టి కలెక్షన్లు కొల్లగొట్టాలని కోరుకుంటున్నాను. అంజలి గారు యాభై సినిమాలు చేయడం అంటే మామూలు విషయం కాదు. ఓ తెలుగమ్మాయి ఇన్ని సినిమాలు చేస్తూ సక్సెస్ సాధించడం గర్వంగా ఉంది. ఇంకా వంద, 150 ఇలా కంటిన్యూ చేస్తూనే ఉండాలి. నందు, భాను టాప్ రైటర్లు కాబోతోన్నారు. మార్చి 22న ఓం భీం బుష్ కూడా రాబోతోంది. అన్ని చిత్రాలు మంచి కలెక్షన్లను సాధించాలి’ అని అన్నారు. కోన వెంకట్ మాట్లాడుతూ.. ‘అంజలికి ఇది 50వ సినిమా. ఇది ఆమెకు ఎంతో ప్రత్యేకం. పదేళ్ల క్రితం గీతాంజలి వచ్చింది. అదొక ట్రెండ్ సెట్టర్. అన్ని భాషల్లో ఈ చిత్రం అప్పట్లో హిట్ అయింది. 3.5 కోట్లతో తీసిన గీతాంజలి అన్ని భాషల్లో విజయవంతం అయింది. గీతాంజలి మూవీతో మ్యూజిక్ డైరెక్టర్ ప్రవీణ్ లక్కరాజు, లిరిక్ రైటర్ శ్రీజో ఇలా ఎంతో మంది పరిచయం అయ్యారు. ఓ మూవీ సక్సెస్ అయితే ఎంతో మంది ఇండస్ట్రీకి పరిచయం అవుతారు. మళ్లీ గీతాంజలి మళ్లీ వచ్చింది అనే సినిమాను తీయడానికి పదేళ్లు పట్టింది. మార్చి 22న శ్రీ విష్ణు ఓం భీం బుష్ రిలీజ్ అవుతోంది.. మా సినిమా కూడా అప్పుడే వస్తోంది. అయినా కూడా మా ఈవెంట్‌కు వచ్చిన శ్రీ విష్ణుకి థాంక్స్. ఇలాంటి వారి వల్లే ఇండస్ట్రీ చాలా హెల్దీగా ఉంటుంది. ప్రేక్షకులందరూ మా సినిమాను చూసి ఆదరించండి’ అని అన్నారు.

# దుబాయ్‌లో టిఎఫ్‌సిసి సౌత్ ఇండియా నంది అవార్డులు



తెలంగాణ ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో దుబాయ్‌లో అంగరంగ వైభవంగా టిఎఫ్‌సిసి సౌత్ ఇండియా నంది అవార్డులు జరగనున్నాయి. ఈ సందర్భంగా దుబాయ్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్ లో టిఎఫ్‌సిసి నంది అవార్డులకు సంబంధించిన బ్రౌచర్‌ను ప్రముఖ నటుడు హీరో సుమన్ చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హీరో సుమన్ గారు మాట్లాడుతూ.. దుబాయ్ ఎంతో అభివృద్ధి చెందిన దేశం, ఇక్కడ వ్యాపారం మాత్రమే కాకుండా కళలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటి వరకు దుబాయ్‌లో ఉత్తరాదికి చెందిన సినిమా అవార్డుల వేడుకలు జరిగాయి, ఈసారి టిఎఫ్‌సిసి సౌతిండియా నంది అవార్డులను దుబాయ్‌లో నిర్వహిస్తున్నందుకు ఛైర్మన్ డా.ప్రతాని రామకృష్ణగౌడ్ గారిని అభినందిస్తున్నాను. ప్రత కళాకారుడు, టెక్నీషియన్‌కి గుర్తింపు ఎంతో అవసరం, ప్రతిభను గుర్తించి వారికి నంది అవార్డులను ఇచ్చి వారిలో మరింత చైతన్యం, ఉత్తేజం కలిగించడం మంచి విషయం. ఈ అవార్డుల కార్యక్రమానికి అందరూ హాజరై తెలుగు సినిమా వైభవాన్ని మరింత తేజోవంతం చేయాలని కోరుతున్నాను అన్నారు. అనంతరం తెలంగాణ ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ లయన్ డా.ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ.. గత ఏడాదే నిర్వహించాల్సిన టిఎఫ్‌సిసి నంది అవార్డులు తెలంగాణ ఎన్నికల కారణంగా వాయిదాపడ్డాయి. కానీ ఈ సంవత్సరం దుబాయ్‌లో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.. కళాకారులకు ఓ ప్రత్యేక గుర్తింపునిచ్చే టిఎఫ్‌సిసి నంది అవార్డుల కార్యక్రమానికి సుమన్ గారు సహకరించడం ఆయన మంచి మంచి మనసుకు తార్కాణం. ఇక ఈ టిఎఫ్‌సిసి సౌత్ ఇండియా నంది అవార్డులను కేవలం తెలుగు కళాకారులకే కాకుండా తమిళ, మలయాళ, కన్నడ సినీ రంగాల వారికి కూడా ప్రధానం చేయబోతున్నాం. సినీ రంగంలోని నటీ నటులతో పాటు 24 క్రాఫ్ట్స్‌కి చెందిన ప్రతిభ గల వారికి ఈ అవార్డులను అందించనున్నాం. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మాతో పాటు మీరు కూడా దుబాయ్‌కి విచ్చేసి టిఎఫ్‌సిసి సౌతిండియా నంది అవార్డుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నాం అన్నారు. దుబాయ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో టి హోమ్స్ సీఎండీ వైకుంఠరావు, దుబాయ్ ప్రిన్స్ మేనేజర్ బిను చార్లీ, సీఏ రవికుమార్ సింగిరి తదితరులు పాల్గొన్నారు

# యూత్ ఫుల్ ఎమోషనల్ బ్లాక్ బస్టర్ ‘సిద్ధార్థ్ రాయ్'



పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్, యంగ్ హీరో దీపక్ సరోజ్ హీరోగా అరంగేట్రం చేసిన చిత్రం ‘సిద్ధార్థ్ రాయ్’. హరీష్ శంకర్, వంశీ పైడిపల్లి వంటి పెద్ద దర్శకుల వద్ద పనిచేసిన వి యశస్వీ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. తన్వి నేగి కథానాయికగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్, విహాన్ & విహిన్ క్రియేషన్స్ పతాకాలపై ప్రొడక్షన్ నెం 1గా జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయినలు సంయుక్తంగా నిర్మించారు. ఫిబ్రవరి 23న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అందరినీ అలరించి యూత్ ఫుల్ ఎమోషనల్ బ్లాక్ బస్టర్ గా అలరిస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సక్సెస్ ప్రెస్ మీట్ ని నిర్వహించింది. యూత్ ఫుల్ ఎమోషనల్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్ లో దర్శకుడు వి యశస్వీ మాట్లాడుతూ.. ‘సిద్ధార్థ్ రాయ్’ సినిమా థియేటర్స్ లో ఆదరిస్తున్న ప్రేక్షకులకు, ముఖ్యంగా యూత్ కి మా యూనిట్ తరపున ధన్యవాదాలు. థియేటర్స్ లో మంచి ఫుట్ పాల్ వుంది. అన్ని ఏరియాల నుంచి డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబ్యూటర్స్ ఫోన్స్ చేసి ఈ వారం వచ్చిన సినిమాల్లో ‘సిద్ధార్థ్ రాయ్’ మంచి సినిమాగా రన్ అవుతుందని చెప్పడం అనందంగా వుంది. ఈ రోజు ఇంకాస్త మెరుగ్గా ఫుట్ ఫాల్ వుంది. ఈ వీకెండ్ మా సినిమా మరింత ప్రేక్షకుల ఆదరణ అందుకొని ముందుకు వెళ్తుందని భావిస్తున్నాం. సినిమాకి చాలా మంచి రెస్పాన్స్ వుంది. యువ ప్రేక్షకులు ఫస్ట్ హాఫ్ కి చాలా కనెక్ట్ అయ్యారు. సెకండ్ హాఫ్ కి పెద్దలు, ఫ్యామిలీస్ కనెక్ట్ అయ్యారు. ఒక యునిక్ బ్లెండ్ తో వుంది సినిమా. మేము అనుకున్నట్లే ఆడియన్స్ నుంచి రెస్పాన్స్ వుంది. దీపక్, తన్వి పెర్ఫార్మెన్స్ కి మెస్మరైజ్ అవుతున్నారు. పాటలని కూడా ఎంజాయ్ చేస్తున్నారు. మా సినిమా థియేటర్స్ లో ఇంకా బాగా ఆడి మేము అనుకున్నట్లుగా కమర్షియల్ పే అఫ్ ఇస్తుందని నమ్ముతున్నాం. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' తెలిపారు.



# 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు



విలక్షణ డైలాగ్ డెలివరీతో నటుడిగా తనకంటూ ఓ మార్క్ క్రియేట్ చేసుకున్న అభినవ్ గోమఠం హీరోగా, వైశాలిరాజ్ హీరోయిన్‌గా రూపొందిన చిత్రం మస్తు షేడ్స్ ఉన్నాయ్ కాసుల క్రియేటివ్ వర్క్స్ పతాకపంపై తిరుపతి రావు ఇండ్ల దర్శకత్వంలో భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్. వి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఫిబ్రవరి 23న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విదుదలైంది. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణతో విజయవంతగా ప్రదర్శింపబడుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఆదివారం థ్యాంక్స్ మీట్‌ను ఏర్పాటు చేసింది. చిన్న సినిమా విడుదల కావాలంటే నేడు ఎంతో కష్టమని, ఈ సినిమా గురించి ఎన్నో అటుపోటులు ఎదుర్కొన్నానని, నేడు సినిమా విడుదలై ప్రేక్షకుల ఆదరణంతో విజయవంతంగా ప్రదర్శింపబడుతోందని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి నా ధన్యవాదాలు అంటూ కన్నీటి పర్యంతమయ్యారు నిర్మాత భవాని కాసుల. దర్శకుడు మాట్లాడుతూ మా చిన్న సినిమాకు మీడియా అందిస్తున్న సహకారం మరువలేనిది. వాళ్లు భుజాలపై మా సినిమాను మోస్తున్నారు. రోజు రోజుకు సినిమా పట్ల ప్రేక్షకుల ఆదరణ పెరుగుతుంది. తప్పకుండా మా సినిమాను అందరూ చూసి ఎంకరైజ్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు. నటుడు అభినవ్ గోమఠం మాట్లాడుతూ సినిమా విడుదల వరకు ఎంతో ఒత్తిడి వుండేది. ఫైనల్‌గా సినిమా పట్ల ప్రేక్షకుల స్పందన చూసి రిలాక్స్ అయ్యాను. నిర్మాత భవాని గారు ఈసినిమా కోసం ఎంతో కష్టపడ్డారు. అందరి శ్రమకు తగిన ప్రతిఫలం లభించిందని అన్నారు. ఈ సమావేశంలో హీరోయిన్ వైశాలి, రచయిత రాధాక్రిష్ణ, నటులు రోహన్‌రాయ్, మెయిన్ తదితరులు పాల్గొన్నారు.

# బలగం వేణు డైరెక్షన్ లో నాని?



బలగం సినిమాతో దర్శకుడిగా కమెడియన్ వేణు ప్రయాణం మొదలుపెట్టాడు. మూడు కోట్ల బడ్జెట్ తో తీసిన ఈ సినిమా ఏకంగా 26 కోట్ల షేర్ కలెక్ట్ చేసింది. దిల్ రాజు సెకండ్ బ్యానర్ లో మొదటి సినిమాగా వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఇప్పుడు వేణుకి దిల్ రాజు మరో ఆఫర్ ఇస్తున్నారు. ఈ విషయాన్ని గతంలోనే ధృవీకరించారు. ఈ సినిమాకి సంబందించిన రంగం సిద్ధం అవుతున్నట్లు నేచురల్ స్టార్ నానితో వేణు నెక్స్ట్ మూవీ ఉండబోతోందని చాలా కాలం నుంచి ప్రచారం నడుస్తోంది. ఇప్పటికే స్టోరీ లైన్ చెప్పి ఒకే చేయించుకున్నారంట. ప్రస్తుతం ఈ మూవీ బౌండెడ్ స్క్రిప్ట్ సిద్ధం చేసే పనిలో వేణు ఉన్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాకి ఎల్లమ్మ అనే టైటిల్ ఫిక్స్ చేశారని టాక్. పీరియాడికల్ జోనర్ లో కథాంశం ఉండబోతోందని తెలుస్తోంది. 1980 బ్యాక్ డ్రాప్ లో గ్రామీణ తెలంగాణ నేపథ్యంలో ఈ కథ ఉంటుందంట. సినిమాలో బలమైన ఎమోషన్స్ తో పాటు యాక్షన్ అంశాలు కూడా ఉంటాయంట. ఫ్యామిలీ అండ్ లవ్ ఎలిమెంట్స్ కూడా కథలో భాగంగా ఉంటాయని తెలుస్తోంది. పీరియాడికల్ జోనర్ కావడంతో మూవీకి 40 నుంచి 50 కోట్ల మధ్యలో బడ్జెట్ అవుతుందంట. నేచురల్ స్టార్ నాని మార్కెట్ దసరా సినిమా తర్వాత పెరిగిన కూడా ఇంకా 50 కోట్ల బిజినెస్ అయితే అతని మీద జరగడం లేదు. దానికి తోడు 3 కోట్లతో మొదటి సినిమా చేసి ఇప్పుడు ఏకంగా 50 కోట్ల బడ్జెట్ ప్రాజెక్ట్ అంటే కచ్చితంగా వేణు మీద పెద్ద భారమే అవుతుంది. దీనిని అతను ఎలా హ్యాండిల్ చేయగలడు అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది. అయితే వేణు వెనుక దిల్ రాజు లాంటి స్టార్ ప్రొడ్యూసర్ ఉన్నారు. బడ్జెట్ ఎంత అయిన దానిని మార్కెట్ చేసుకునే సామర్థ్యం దిల్ రాజు సొంతం. దిల్ రాజు కథని బాగా నమ్మితే భారీ బడ్జెట్ పెట్టడానికి వెనుకాడరు. ఇప్పుడు వేణు సిద్ధం చేసిన ఎల్లమ్మ స్టోరీ మీద నమ్మకంతోనే దిల్ రాజు ఆ స్థాయిలో బడ్జెట్ పెట్టడానికి రెడీ అయ్యారంట.

# కియారాలో పట్టుదల కనిపిస్తోంది!

బాలీవుడ్ టూ టాలీవుడ్ కియారా అద్వానీ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు జర్నీ రెండు భాషల్లోనూ దేదీప్యమానంగా సాగిపోతుంది. `గేమ్ ఛేంజర్` విజయం సాధిస్తే అమ్మడి రేంజ్ అంత కంతకు రెట్టింపు అయిపోతుంది. ఇదే సమయంలో తెలివైన నిర్ణయాలతో ముందడుగు వేస్తుంది. కమర్శి యల్ చిత్రాలతో పాటు సాహసోపేతమైన పాత్రలకు సైతం సై అంటోంది. వాస్తవానికి కియారాలో ఆ క్వాలిటీ ముందు నుంచి ఉంది. కెరీర్ ఆరంభంలో బోల్డ్ పాత్రలకు సైతం సై అని బాలీవుడ్ ని షేక్ చేసింది. అది చూసి కియారాలో ఇంత తెగింపు ఉందా? అని అంతా సక్సెస్ తర్వాత మాట్లాడుకున్నారు. ప్రస్తుతం అమ్మడి ఖాతాలో చాలా సినిమా లున్నాయి. ఇటీవలే ప్రతిష్టాత్మక ఫ్రాంచైజీ డాన్ -3 లోనూ హీరోయిన్ గా ఎంపికైంది. దీంతో కియారా యాక్షన్ వరల్డ్ లోకి అడుగు పెట్టినట్లు అయింది. ఇంతవరకూ ఈ తరహా పాత్రలు పోషించలేదు. అవకాశం రాకపోవడంతో ఆ ఛాన్స్ తీసుకోలేదు. ఇకపై తానేంటో చూపిస్తానంటూ రంగంలోకి దిగుతుంది. ఈ సందర్భంగా కియారా కెరీర్ ని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. యాక్షన్ సినిమాలు ఇంత వరకూ చేయలేదు. ఇక ఆ సమయం వచ్చేసింది. ప్రేక్షకుల ముందుకు నాలో కొత్త కోణాన్ని తీసుకొస్తున్నా. ఓ నటి గా విభిన్నమైన పాత్రలు చేస్తూ ..నటిగా నీకు అలాంటి పాత్రలే సరైనవని ప్రపంచం అనుకునేలా చేయాలి` అంటోంది. కియారా వ్యాఖ్యల్ని బట్టి కెరీర్ పరంగా ఆమె ఎలాంటి ఆలోచనలతో ఉందో అర్ధమవుతుంది. నటిగా ఉన్నత శిఖరాలు చేరాలి అన్న కసి పట్టుదల ఆమె మాటల్లో కనిపిస్తుంది. `గేమ్ ఛేంజర్` లోనూ కియారా పవర్ ఫుల్ రోల్ పోషిస్తుంది. అయితే ఆ పాత్ర గురించి ఎక్కడా రివీల్ చేయడం లేదు. ఇది అమ్మడికి తొలి పాన్ ఇండియా చిత్రం. శంకర్ సినిమా హిట్ అయితే ఎలా ఉం టుందో? చెప్పాల్సిన పనిలేదు. ఓవర్ నైట్ లో స్టార్ హీరోయిన్ అయిపోతుంది. శంకర్ బ్రాండ్ తో మార్కెట్ లో తిరుగులేని ఛాన్సులు దక్కించుకునే అవకాశం ఉంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.